# కేసీఆర్‌ని మంచి మెజారిటీతో గెలిపించాలి




యదార్థవాది, గజ్వేల్, 17 నవంబరు : సిద్దిపేట జిల్లా, గజ్వేల్ నియోజకవర్గం, మర్కుక్ లో మంత్రి హరీశ్ రావు రోడ్ షో సందర్భంగా మాట్లాడారు. మర్కుక్ దశ, దిశ మార్చింది కేసీఆర్. నీళ్ల కష్టాలు తీర్చాడు. రోడ్లు లేక నాడు ఎంతో ఇబ్బందులు. నేడు డబుల్ రోడ్లు కనిపిస్తున్నాయి. గతుకుల గజ్వేల్ బతుకుల గజ్వేల్ చేసిండు. నెత్తిమీద గంగమ్మ లెక్క కొండపోచమ్మ సాగర్ తెచ్చింది కేసీఆరని అన్నారు. మా మండలం కేసీఆర్ అని గొప్పగా చెప్పుకుంటారు. తెలంగాణకు తొలి సీఎం కేసీఆర్, దక్షిణ భారతదేశంలో హ్యాట్రిక్ సీఎం కేసీఆర్. కష్టంలో లేదు, సుఖంలో లేదు ఎక్కడి నుండి వస్తున్నారు. ఎవడో వచ్చి బిడ్డ బిడ్డ అంటే నమ్మితే మోస పోతాం. ఇంకొకడు వస్తే రియల్ ఎస్టేట్ వ్యాపారం ఉండదు, అభివృద్ధి ఉండదు. నాడు నేను రాను బిడ్డో సర్కారు దవాఖాన అంటే నేడు పోదాం పద సర్కారు దవాఖాన అంటున్నారు. ఈసారి కారు గెలవగానే సన్నబియ్యం, పాత బియ్యం ఇవ్వబోతున్నాము. అసైన్డ్ ల్యాండ్స్ కి పట్టా ఇచ్చి హక్కులు ఇవ్వబోతున్నం. సిలిండర్ ధరలు పెంచిన బిజెపి వాళ్ళని

మిగతా 5లో

# రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే



- దేశంలో విచ్ఛిన్నకర శక్తులతో జాగ్రత్త... సమగ్రత కాపాడుకోవాలి..
- బిఆర్ ఎస్ నమ్మి 10 ఏళ్ళు మోసపోయారు...
- తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ని గెలిపించండి..
- రాష్ట్ర బడ్జెట్ తో పేదలను, అన్నివర్గాల ఆదుకుంటాం : కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ

యదార్థవాది, పినపాక – 17, నవంబర్ : తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఒక అవకాశం ఇవ్వండి.. నిజమైన సంక్షేమ పాలన ఎక్కవుంటుందో ఆచరణలో చూపిస్తాం... బిఆర్ ఎస్ పార్టీ మాయ మాటలు ఇక నమ్మొద్దు.. వారిని గెలిపిస్తే మళ్ళీ ఐదేళ్ల దోపిడీ, నియంత పాలనే అనుభవించాలి అంటూ కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ స్పష్టం చేసారు. దేశంలో విచ్ఛిన్నకర శక్తులపట్ల మెలుకువగా ఉండాలని ప్రజలను కోరారు. దేశ సమగ్రతను కాపాడు కోనేందుకు ముఖ్యంగా యువత ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. ఈ నెల 30 న జరిగే ఎన్నికలలో కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారం లోకి రాబోతుందన్నారు. కేసీఆర్ మాయలాడి మటలు ద్వంద వైఖరిని ప్రజలు అర్థం చేసుకున్నారు... అందుకే ఈసారి ప్రజలు కాంగ్రెస్ అభ్యర్థులను గ్శలిపించి కేసీఆర్ పై గులాబీ దండు పై తీర్పు చెప్పబోతున్నారని తెలిపారు. పదేళ్లు తెలంగాణను బీఆర్ఎస్ ప్రభుత్వం దోచుకుందన్నారు. ఆకర్షణియా అభివృద్ధి పథకాలంటూ పేర్లు పెట్టి కమిషన్ ల రూపంలో వేలకోట్లు ప్రజా ధనాన్ని జేబుల్లో వేసుకుంబరని ఆరోపించారు. ఈ దఫా ఎన్నికల్లో కాంగ్రెస్ తుపానులో కేసీఆర్, బిఆర్ ఎస్ దండు కొట్టుకుపోక తప్పదన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గన్నవరం నుండి ప్రత్యేక హెలికాప్టర్లో ఆయన మణుగూరు కు చేరుకున్నారు. ఉదయం నుండి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు, నాయకులు భారీ సంఖ్యలో ఆయన రాకకోసం అంబేద్కర్ సెంటర్ చేరుకున్నారు. మణుగూరు పట్టణ మంతా జన సంద్రాన్ని తలపిం చింది. తమ ఆత్మీయ కుటుంబ నేత రాహుల్ ను చూసేందుకు మహికలు, వృద్ధులు, యువకులు పెద్దఎత్తున వచ్చారు. అడుగడుగునా జై జై రాహుల్, రేవంతన్న, కాంగ్రెస్ పార్టీ అంటూ పెద్ద పెట్టున నినాదాలతో మణుగూరు పట్టణం మారుమోగింది. ప్రతి పల్లె పట్టణం, గ్రామం అనే తేడా లేకుండా భారీ సంఖ్యలో అశేష జనావాహిని రాహుల్ గాంధీ కోసం, ఆయన చెప్పే మాటల కోసం గంటల తరబడి ఎదురుచూసారు. మధ్యాహ్నం హెలికాప్టర్లో మణుగూరు

మిగతా 2లో

# డీప్‌ఫేక్ వీడియోలపై ప్రజలకు అవగాహన కల్పించాలి

### మీడియాను కోరిన ప్రధాని నరేంద్ర మోదీ



యదార్థవాది, న్యూఢిల్లీ, 17 నవంబరు : డీప్‌ఫేక్ వీడియోల అంశంపై ప్రధాని నరేంద్ర మోదీ తాజాగా స్పందించారు. ఈ మేరకు ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని సృష్టించడానికి కృత్రిమ మేధను ఉపయోగించడం సమస్యాత్మకమని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని మీడియాను కోరారు. 'డీప్‌ఫేక్ వీడియోలు మన వ్యవస్థకు పెను ముప్పుగా మారుతున్నాయి. ఇవి సమాజంలో గందరగోళానికి కారణమవుతున్నాయి. ఇటీవలే నేను గార్బా పాట పాడినట్లుగా ఓ వీడియో వైరల్ అయ్యింది. అది నా దృష్టికి కూడా వచ్చింది. అదే కాదు అలాంటి వీడియోలు అనేకం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ డీప్‌ఫేక్ వీడియోలపై ప్రజలకు మీడియా వాళ్లు అవగాహన కల్పించాలి. ఇలాంటి వీడియోలు ఇంటర్నెట్‌లో వైరల్ అయినప్పుడు

మిగతా 2లో

### 46,463.82 ఎకరాలపై హక్కులు కల్పిస్తూ

# డీకేటీ పట్టాలు ఇస్తున్నాం

### సీఎం జగన్




యదార్థవాది, నూజివీడు, 17 నవంబరు : పేదల భూములపై వారికి సర్వ హక్కులు కల్పించింది మీ బిడ్డ ప్రభుత్వమే అని సీఎం జగన్ పేర్కొన్నారు. రైతుల భూ సమస్యలకు పరిష్కారం చూపించామని, 2003 నాటి అసైన్డ్ భూములకు హక్కులు కల్పిస్తు న్నామని, కొత్తగా డీకేటి పట్టాలను అందిస్తున్నామని పేర్కొన్నారు. పేదవాళ్లకు వెన్నుదన్నుగా ఉంటే పెత్తందార్లకు నచ్చడం లేదని, పేదవర్గాల పట్ల బాధ్యతగా చిత్తశుద్ధితో వ్యవహరిస్తుంటే ప్రతిపక్షం కుట్రలు చేయాలని చూస్తోందని ఆరోపించారు. ఏలూరు జిల్లా నూజివీడులో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం జగన్ పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 46,463.82 ఎకరాలకు సంబంధించి 42,307 మందికి డీకేటీ పట్టాలు పంపిణీ చేశారు. నిరుపేదలకు భూముల పంపిణీని ప్రారంభించడంతోపాటు అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పించడం, లంక భూములకు పట్టాలు అందజేశారు. చుక్కల భూములు, షరతుల గల పట్టా భూములు, సర్వీస్ ఇనాం భూములను 22 ఏ

మిగతా 4లో

# గాజాలో వృద్ధుల విలవిల!

- రాత్రిళ్లు 17 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు.. శిబిరాల్లో అరకొర వసతులు
- దుప్పట్లు, రగ్గులకు తీవ్రమైన కొరత
- హమాస్ సొరంగాల్లోకి వేటకుక్కలు



ఇజ్రాయెల్: ఇజ్రాయెల్ ముట్టడిలో ఉన్న గాజాలో వృద్ధులు.. వసతులు, వనరుల్లేక విలవిల్లాడిపోతున్నారు. నిర్వాసితుల కోసం ఐక్య రాజ్య సమితి(ఐరాస) నిర్వహి

మిగతా 3లో

# అమిత్‌షా షెడ్యూల్‌లో మార్పులు



యదార్థవాది, హైదరాబాద్, 17 నవంబరు: ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ అగ్ర నేత, కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలంగాణకు వస్తోన్న షెడ్యూల్ మరోసారి మారింది. షెడ్యూల్ ప్రకారం శుక్రవారం రాత్రికి ఆయన హైదరాబాద్ చేరుకోవాల్సి ఉంది. కానీ చివరి నిమిషంలో స్వల్ప మార్పులు జరిగాయి. మారిన షెడ్యూల్ ప్రకారం శనివారం మధ్యాహ్నం 12 గంటలకు బేగంపేట విమానాశ్రయానికి చేరుకోనున్నారని బీజేపీ తెలిపింది. అనంతరం 12.50 కు గద్వాల సభలో పాల్గొంటారు. అనంతరం అక్కడి నుంచి నల్గొండ, వరంగల్ సభల్లో పాల్గొంటారు. అనంతరం అక్కడి నుంచి సాయంత్రం 6.10 గంటలకు హోటల్ క్షత్రియలో బీజేపీ ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేయనున్నారు.తర్వాత ఎంఆర్పీఎస్ నాయకులతో సమావేశంలో పాల్గొంటారు. సాయంత్రం 7:55 కి బేగంపేట విమానాశ్రయం నుంచి షా అహ్మదాబాద్ బయలుదేరనున్నారు. మొదట షా

మిగతా 4లో

# ఒక్క ఛాన్స్ అంటున్న కాంగ్రెస్ కు బుద్ధి చెప్పాలి

### మంత్రి హరీష్ రావు



యదార్థవాది, హైదరాబాద్, 17 నవంబరు : తెలంగాణ భవన్‌లో మంత్రి హరీశ్ రావు శుక్రవారం మీడియాతో మాట్లాడారు. రాహుల్ గాంధీ ఆరు గ్యారంటీ అంటూ తెలంగాణ ప్రజలను మోసం చేయటానికి వస్తున్నారు. కర్ణాటకలో ఇచ్చిన హామిలే అమలు కావడం లేదు. కర్ణాటక లో ఓటేసిన ప్రజలకు పథకాలు అందటం లేదని అన్నారు. కర్ణాటక ప్రజలు ఏది అడిగినా ఖజానా ఖాళీ అయ్యింది అని అక్కడ సీఎం చెప్తున్నారు. అయిదు గ్యారంటీలని చెప్పిన కాంగ్రెస్ ప్రజలకు రాం రాం చెప్పారు. ఎన్నికలప్పుడు ఓడ మల్లప్ప

మిగతా 7లో

# మధ్యప్రదేశ్‌లో 76%..

- ఛత్తీస్‌గఢ్‌లో 70% పోలింగ్
- ఛత్తీస్‌గఢ్‌లో నక్సల్స్ దాడి.. జవాను మృతి



భోపాల్/రాయ్‌పూర్, నవంబరు 17: మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో శుక్రవారం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 70 శాతానికి పైగా పోలింగ్ నమోదైంది. మధ్యప్రదేశ్‌లో 76%, ఛత్తీస్‌గఢ్‌లో 70.50% పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. రెండో దశలో భాగంగా 70 స్థానాలకు జరిగిన ఛత్తీసగఢ్ ఎన్నికల సందర్భంగా జరిగిన నక్సల్స్ హింసలో ఓ జవాను మరణించ

మిగతా 2లో

# గంగుల?. నీలెక్క గుట్టలు మాయం చేశానా ?

- భూకబ్జాలు చేశానా ?
- పేదల ఇండ్లు కూల్చి సంపాదించానా ?




యదార్థవాది, కరీంనగర్, 17 నవంబరు : కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ బిజెపి అభ్యర్థి బండి సంజయ్ ప్రచారంలో భాగంగా చామనపల్లిలో గంగుల కమలాకర్ పై విమర్శనాస్త్రాలు సంధించారు. తనను అవినీతిపరులు అని అన్నాడని నా దగ్గర డబ్బు సంచులున్నయని. అందుకే అధ్యక్ష పదవి నుండి నన్ను తీసేశారట. నేనేమైనా ఆయన లెక్క మంత్రినా? అధికారంలో ఉన్నామా ? గంగుల లెక్క గుట్టలు మాయం చేశానా ? భూములు కబ్జా చేసి కమీషన్లు దొబ్బిననా ? నేనెట్లా అవినీతి చేస్తా నని బండి సంజయ్ కుమార్ ప్రశ్నించారు. రాష్ట్ర అధ్యక్షుడికి, జాతీయ ప్రధాన కార్యదర్శికి తేడా తెలియని మూర్ఖుడు గంగుల అని ధ్వజమెత్తారు. "నా పార్టీ నాకు హెలికాప్టర్ ఇచ్చి రాష్ట్రమంతా ఎన్నికల ప్రచారం చేయాలని పంపుతోంది. అవినీతికి పాల్పడితే ఎమ్మెల్యే టిక్కెట్ ఇవ్వరు. హెలికాప్టర్ ఇవ్వరు. జాతీయ ప్రధాన కార్యదర్శి పదవి ఇవ్వరు.. మోదీ అవినీతి పరుల గుండెల్లో రైళ్లు పరిగెస్తడని తెల్వదా?" అని నిలదీశారు. తెలంగాణలో అత్యంత అవినీతిపరుడు గంగుల కమలాకరేనని అన్నారు. అవినీతిలో తెలంగాణలో కరీంనగర్ టాప్ అని రాష్ట్ర ప్రభుత్వ నిఘా నివేదికలే చెబుతున్నయన్నారు. "అవినీతికి పాల్పడుతున్నందుకే

మిగతా 6లో

వ్యాధులతో బాధపడు తున్నారు. ఇజ్రాయెల్ దాడులు ప్రారంభమైనప్పటి నుంచి 11,500 మంది పాలస్తీనీ లు చనిపోగా.. మృతుల్లో 627 మంది వృద్ధులున్నారు.

### వెయ్యి మందికి ఒక టాయ్‌లెట్

దక్షిణ గాజాలోని శరణార్థి శిబిరాల్లో ప్రతి వెయ్యి మందికి ఒకటి చొప్పున టాయ్‌లెట్లున్నాయి. అక్కడ పరిస్థితిని మజౌజా నసీర్ అనే 86 ఏళ్ల వృద్ధురాలు అంతర్జాతీయ మీడియాకు వివరించారు. "టాయ్‌లెట్ల వద్ద భారీ క్యూలైన్లుంటాయి. ఐదారు గంటలు నిలబడితే తప్ప.. లోపలికి వెళ్లలేం. ఈ పరిస్థితి వృద్ధులు, మహిళల పాలిట శాపమే. అసలే అన్నపానీయాలు దొరకడం లేదు. దొరికిన ఆహారాన్ని తిందామన్నా.. మరుగుదొడ్ల వద్ద క్యూలైన్ల భయంతో పస్తులుంటున్నాం" అని ఆమె వివరించారు. ఇలాంటి చర్యల వల్ల వృద్ధులు, మహిళలు ఉన్నవ్యాధులకు తోడు కొత్త రుగ్మతలను కొనితెచ్చుకునే ప్రమాదముందని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

టైప్-1 మధుమేహులకు ఇన్సులిన్‌లు దొరకడం లేదని చెప్పారు. హృద్రోగులు, క్యాన్సర్, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి కూడా సరైన ఔషధాలు అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. గాజాలోని యుద్ధ తీవ్రత ఉన్న ప్రాంతాల్లో మృతదేహాలు, జంతువుల కళేబరాలకు తోడు.. వర్షాల కారణంగా అంటువ్యాధుల ముప్పు పొంచి ఉందని, ఐరాస క్యాంపుల్లోనూ అపరిశుభ్రత రాజ్యమేలుతోందని వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### ఆగని కాల్పులు.. యుద్ధం

గాజాపై ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస(ఐడీఎఫ్) తెరిపినివ్వకుండా కాల్పులు జరుపుతోంది. అల్-షిఫా ఆస్పత్రిలో మూడు విభాగాలను ధ్వంసం చేసినట్లు అల్-హుర్రా న్యూస్ చానల్ పేర్కొంది. హమాస్‌తోపాటు.. 'ఇస్లామిక్ జిహాద్' సంస్థకు చెందిన పలు స్థావరాలను ధ్వంసం చేసినట్లు ఐడీఎఫ్ ప్రకటించింది. సొరంగాల్లో హమాస్ బాబీట్రాపలు ఉండడంతో.. ఇజ్రాయెల్ సైన్యం వేటకుక్కలు, రోబోలను పంపుతోంది. గురువారం హమాస్ పొలిట్ బ్యూరో చీఫ్ ఇస్మాయిల్ హనియే ఇంటిని ధ్వంసం చేసింది. ఖాన్‌యూనిస్ నగరంలోనూ పౌరులంతా ఇళ్లను ఖాళీ చేసి, దక్షిణాదికి వెళ్లిపోవాలంటూ ఆదేశాలను జారీ చేసింది. దీన్ని బట్టి ఆ నగరంపైనా ముప్పేట దాడులకు ఐడీఎఫ్ సిద్ధమైన్నట్లు స్పష్టమవుతోంది. అల్-షిఫా ఆస్పత్రి పక్కనే ఉన్న ఓ భవనంలో ఇద్దరు బందీల మృతదేహాలు లభ్యమైనట్లు ఐడీఎఫ్ తెలిపింది.

అభ్యర్థి జారె ఆదినారాయణ అన్నారు. శుక్రవారం నియోజకవర్గ కేంద్రమైన అశ్వారావుపేటలో కొట్టు కొట్టుకు ప్రచారం చేసారు. అయన పట్టణంలోని వ్యాపారులతో కలిసి అప్యాయంగా పలకరిస్తూ ఓటును అభ్యర్థిం చారు. ఓటు అనే ఆయుధంతో తమ హక్కులను కాపాడుకోవాలని సూచించారు. మీలో ఒకడైనా తనను గెలిపిస్తే ఏ స్థాయికి ఎదిగిన మీతో, మీలో ఒక్కరిగా పని చేస్తానని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ గెలిస్తే రెండు లక్షల రూపాయల రుణామాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్ , ఆసరా ఫించన్, రైతు బంధు సహాయాన్ని పెంచడం జరుగుతుందన్నారు. యువకులకు ఉద్యోగ కల్పన, నిరుద్యోగ భృతి ఇస్తుందని, మధ్య తరగతి మహిళలకు సహాయం అందజేస్తుందన్నారు. పేదలకు భరోసాగా కాంగ్రెస్ పార్టీ ఉంటందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పవనాలు విస్తున్నాయి అన్నారు. పోలీస్‌స్టేషన్ సెంటర్‌లో మిర్చి బజ్జిలు వేసి ప్రచారం చేసారు. ఈ ప్రచారంలో జూపల్లి



రమేష్, మెగళ్ళపు చెన్నకేశవరావు, తుమ్మా రాంబాబు, ఎంపిటిసిలు వేముల భారతి, సత్యవరపు తిరుమల, అశ్వారావుపేట సర్పంచ్ అట్టం రమ్య, కేధర్‌నాధ్, నార్లపాటి రాములు, బూసి పాండు, బండారి మహేశ్వరరావు, కొప్పుల శ్రీను చిన్నంశెట్టి సత్యనారాయణ, జేష్ట సత్యనారాయణ ఛౌదరి ఫణి, ప్రమోద్ తదితరలు పాల్గొన్నారు.

# కార్మికుల కలలను నెరవేర్చేది కాంగ్రెసే

### రామగుండం కాంగ్రెస్ అభ్యర్థి రాజ్ ఠాకూర్



**యదార్థవాది, రామగుండం, 17 నవంబర్ :** కార్మిక,కర్షక బడుగు బలహీన వర్గాల కలలు నెరవేర్చేది కాంగ్రెసే నని రామగుండం కాంగ్రెస్ అభ్యర్థి అన్నారు."సింగరేణి కార్మికుల దీవెన యాత్రలో" భాగంగా శుక్రవారం ఉదయం సంఘటిత, అసంఘటిత కార్మిక సంఘం కాంగ్రెస్ జిల్లా కన్వీనర్ పెంచాల తిరుపతి ఆధ్వర్యంలో రామగుండం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్, ఐ.ఎన్.టి.యు.సి సెక్రటరి జనరల్ జనక్ ప్రసాద్ తో కలిసి జీడికే 2ఇంక్లైన్ కార్మికులను కలిసి ఓటు అభ్యర్థించారు అనంతరం రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ... గడిచిన తొమ్మిదేండ్లలో సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగిందని,తెరాస అనుబంధ కార్మిక సంఘం టిబిజీకేఎస్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయిందని విమర్శించారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే కార్మికుల ఆదాయ పన్ను మినహాయింపు చేస్తామని, కార్మికుల సొంతింటి కల నెరవేరుస్తామని, దానితో పాటుగా కార్మికుల శ్రేయస్సు కోసమే పని చేస్తామని అన్నారు.వారితో పాటుగా ఐఎన్టీయూసీ నాయకులు, ఏఐటీయుసి, నాయకులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, వివిధ విభాగాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, మహిళ కార్మికులు మరియు అధిక సంఖ్యలో కార్మికులు ఉన్నారు..



**యదార్థవాది, దోర్నకల్, 17 నవంబరు :** బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి రెడ్యా నాయక్ గెలుపుకు ప్రతి ఒక్కరూ సైనికుల పనిచేయాలని మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న శ్రేణులకు దిశ నిర్దేశం చేశారు.పట్టణ కేంద్రంలో పార్టీ కార్యాలయాన్ని శుక్రవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రతిరోజు విధిగా కార్యాలయంలో సమావేశమై ప్రచార దినచర్యను కొనసాగించాలని కోరారు. కలిసికట్టుగా పోరాడి పార్టీని గెలిపించుకోవాలని విజ్ఞప్తి చేశారు.ప్రజలందరూ బీఆర్ఎస్ వైపే ఉన్నారని అన్నారు.ఈసారి పట్టణంలో భారీ మెజార్టీ వచ్చే అవకాశం ఉందని తెలియజేశారు.కార్యక్రమంలో వైస్ చైర్మన్ కోటిలింగం,మార్కెట్ చైర్మన్ విద్యాసాగర్,ఫ్లోర్ లీడర్ కౌన్సిలర్లు సురేందర్ జైన్,పోటు జనార్దన్, అశోక్,శరత్,సంధ్యా రమేష్, హేమచంద్రశేఖర్,కో ఆప్షన్ సభ్యులు మారబోయిన రాంబద్రం,మియా,డైరెక్టర్ రెడ్డమ్మ, నాయకులు హనుమ,మల్లం అనిల్,వేణు,చంటి, గండి రాము,మైనార్టీ విభాగ సభ్యుడు గౌస్,బీసీ విభాగ సభ్యుడు సూర మధు,కందుల మధు,వీఆర్ వీరస్వామి,సాధనాల రాము తదితరులున్నారు.

## అందరికోసం ఒక్కడు...!

- ఆ ఒక్కడి కోసం మనమందరం..!!
- కెసిఆర్ ను మూడోసారి ముఖ్యమంత్రిని చేద్దాం :
- పారిశ్రామికవేత్త ఎంపీ బండి పార్థసారథి రెడ్డి



**యదార్థవాది, సత్తుపల్లి - 17, నవంబర్ :** ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు నిరంతర అందరికోసం శ్రామికుడిలా పనిచేస్తున్నారని ఆయన గెలుపు కోసం మనమందరం పాటుపడాలని కోసం పరిశ్రమిక వేత్త, రాజ్యసభ సభ్యులు బండి పార్థసారథి రెడి పిలుపు నిచ్చారు. కేసీఆర్ ఎన్నో పథకాలు చేపడుతూ ప్రజా క్షేమాన్ని ఆకాంక్షించే మహా వ్యక్తి అన్నారు. ఆయన కోసం మనందరం సైనికుల్లా ఎన్నికల్లో పనిచేయాలన్నారు. శుక్రవారం మండలంలోని కందుకూరు గ్రామంలో పార్థసారథి రెడ్డి తన కంపెనీలలో పనిచేస్తున్న ఉద్యోగుల కుటుంబ సభ్యులతో ఆత్మీయ సమ్మేళనం పెద్దఎత్తున నిర్వహించారు. సత్తుపల్లి నియోజకవర్గంలో సండ్ర వెంకట వీరయ్య కు ఘనవిజయం అందించాలని ఆయన కోరారు. 2023 నవంబర్ 30న జరిగే తెలంగాణ శాసనసభ ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా తీసుకొని బిఆర్ ఎస్ కు ఘనవిజయం చేకూర్చాలన్నారు. తెలంగాణ ఏర్పడక ముందు రాష్ట్రం ఎలా ఉండేదో ఇప్పుడు జరిగిన, జరుగుతున్న అభివృద్ధి పనులను బేరీజు వేసుకొని ఓటయ్యాలన్నారు. గ్రామాల్లో ప్రజల జీవన సరళి ఎంతో మెరుగైందన్నారు. కెసిఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో అందని కుటుంబం ఎక్కడ కనిపించదన్నారు. అందరి శ్రేయస్సు కోసం పరితపించే కేసీఆర్ పాలనలో మధ్యతరగతి ప్రజలు ఎన్నో ప్రయోజనాలు పొందుతున్నారని వివరించారు. వ్యవసాయ, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నదు వలనే యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు పొందుతున్నారని చెప్పారు. ప్రభుత్వ ప్రైవేటు రంగాల్లో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరిగాయన్నారు. అందరికీ ప్రభుత్వ ఉద్యోగాలుగా కల్పించడం ఏ దేశంలోనూ సాధ్యం కాదన్నారు. తెలంగాణలో చదువుకున్న ప్రతి ఒక్కరూ ఏదో ఒక రంగంలో స్థిరపడేందుకు వీలు కలిగిందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను గుర్తించి వచ్చే ఆదాయ వనరులను అభివృద్ధికి, సంక్షేమానికి కేటాయిస్తున్నారని వివరించారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడం ఎట్టి పరిస్థితుల్లోనూ సాధ్యం కాదన్నారు. ఇక్కడి అభ్యర్థి సండ్ర వెంకట వీరయ్య గెలుపును ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని పిలుపు నిచ్చారు. నియోజకవర్గం నుంచి నాలుగోసారి ఆయనకు అఖండ విజయం అందించాలన్నారు. అపుడే సత్తుపల్లి అన్నిరంగాల్లో ఇంకా పురోగతి సాధిస్తుందని చెప్పారు.

## బిఆర్ఎస్ ఎంత ఖర్చు చేసినా తన గెలుపు ఖాయం

### ప్రజలు దోపిడీ పాలకులను ఓడిస్తారు: కాంగ్రెస్ అభ్యర్థి జారే



**యదార్థవాది, అన్నపురెడ్డిపల్లి, 17 నవంబర్ :** అశ్వారావుపేట నియోజకవర్గంలో అధికార పార్టీ నాయకులు ఎంత ఖర్చు పెట్టినా తనకు ఓడించలేరని ప్రజలు దోపిడీకి వ్యతిరే కంగా తన వైపు నిలిచారాని కాంగ్రెస్ అభ్యర్థి జారే ఆదినారాయణ వెల్లడించారు. మండలంలోని మర్రిగూడెం గ్రామంలో శుక్రవారం నాయకుడు గాలం వలరాజు అతని అనుచరులు సుమారు 106 కుటుంబాలు భారీ సంఖ్యలో జారె సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. నియోజకవర్గంలోనే కాక రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల్లో బిఆర్ ఎస్, కేసీఆర్ దోపిడీ, అక్రమాలు, గారడీ మాటలను ఈ ఎన్నికల్లో తిప్పికొట్టానున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వనమా గాంధీ, పర్స వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

# విడుదల చేసిన కాంగ్రెస్ మేనిఫెస్టో

### విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్

**యదార్థవాది, హైదరాబాద్, 17 నవంబరు :** తెలంగాణ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ మేనిఫెస్టో విడుదలైంది. 42 పేజీల్లో 62 ప్రధాన అంశాలతో 'అభయ హస్తం' పేరుతో మేనిఫెస్టోను ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే విడుదల చేశారు. 6 గ్యారెంటీలు సహా తొలి ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాల భర్తీ, పారదర్శకంగా ప్రభుత్వ ఉద్యోగ నియామక ప్రక్రియ, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, నూతన వ్యవసాయ విధానం, రైతు కమిషన్ ఏర్పాటు వంటి ప్రధాన హామీలున్నాయి. 18 ఏళ్లు నిండి చదువుకునే ప్రతీ విద్యార్థిని ఓ ఎలక్ట్రిక్ స్కూటీ అందిస్తామని మేనిఫెస్టోలో పొందుపరిచారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్ సహా పాత బకాయిలు చెల్లింపు వంటి హామీలు ప్రధానంగా ఉన్నాయి. తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాల్లో ప్రాణాలర్పించిన యువతీ, యువకులను ఉద్యమ అమరవీరులుగా గుర్తించి, వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, అలాగే తల్లి/తండ్రి/భార్యకు రూ.25 వేల నెలవారీ అమరవీరుల గౌరవ పెన్షన్ అందజేయనున్నట్లు కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో పొందుపరిచింది.

### మేనిఫెస్టోలో ప్రధాన అంశాలివే

ప్రజా సమస్యల పరిష్కారానికి సీఎం కార్యాలయంలో ప్రతి రోజూ 'ప్రజా దర్బార్' నిర్వహణ. ఎమ్మెల్యేలు ఆయా నియోజక వర్గాల్లో ప్రజా దర్బార్ నిర్వహణ.

- రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, భూమితో ఉన్న రైతులతో పాటు, కౌలు రైతులకు కూడా ఏడాదికి ఎకరాకు రూ.15 వేలు. భూమి లేని ఉపాధి రైతుల కూలీలకు ఏడాదికి రూ.12 వేలు. అన్ని పంటలకు మెరుగైన మద్దతు ధరతో ప్రభుత్వమే కొనుగోలు. మూతపడిన చక్కెర కర్మాగారాలు తెరిపించి, పసుపు బోర్డు ఏర్పాటు.
- పంట బీమాలో వ్యవసాయ పనుల అనుసంధానం, పంట నష్టపోతే వెంటనే పరిహారం అందేలా పంట బీమా పథకం
- 'ధరణి' స్థానంలో భూమాత పోర్టల్ సరికొత్త రెవెన్యూ వ్యవస్థ, పోడు భూముల రైతులకు, అసైన్డ్ భూముల లబ్ధిదారులకు క్రయ, విక్రయాలతో సహా అన్ని యాజమాన్య హక్కులు.
- రైతు సమస్యల శాశ్వత పరిష్కారానికి చట్టపరమైన అధికారాలతో రైతు కమిషన్ ఏర్పాటు
- తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలర్పించిన యువతను అమరవీరులుగా గుర్తించి, వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, అలాగే తల్లి/తండ్రి/భార్యకు రూ.25 వేల నెలవారీ అమరవీరుల గౌరవ పెన్షన్.
- ఉద్యమంలో పాల్గొన్న యువతపై కేసుల ఎత్తివేత, జూన్ 2న వారికి తెలంగాణ ఉద్యమకారులుగా ప్రభుత్వ గుర్తింపు కార్డు
- తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి వారికి 250 గజాల ఇంటి స్థలం కేటాయించి, గౌరవభృతి అందజేత
- తొలి ఏడాది 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, తొలి ఏడాదిలోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ బ్యాకలాగ్ ఉద్యోగాల భర్తీ
- ప్రతీ ఏటా జూన్ 2 నాటికి జాబ్ క్యాలెండర్, సెప్టెంబర్ 17లోపు నియామకాలు పూర్తి
- నిరుద్యోగ యువతకు ప్రతీ నెలా రూ.4 వేల నిరుద్యోగ భృతి, ప్రత్యేక చట్టంతో టీఎస్ పీఎస్సీ పూర్తి ప్రక్షాళన, యూపీఎస్సీ తరహాలో పునరుద్ధరణ.
- ప్రతి జిల్లాలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లు, ప్రభుత్వ రాయితీలు పొందే ప్రైవేట్ కంపెనీల్లో తెలంగాణ యువతకు 75 శాతం రిజర్వేషన్లు
- విద్య, ఉపాధి అవకాశాలు మెరుగు పరిచేలా యూత్ కమిషన్, రూ.10 లక్షల వరకూ వడ్డీ లేని రుణ సదుపాయం.
- గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం చర్యలు, ఏజెంట్ల నియంత్రణ కోసం ప్రత్యేక గల్ఫ్ విభాగం ఏర్పాటు. మరణించిన గల్ఫ్ కార్మికుడి కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఇబీసీ వర్గాల విద్యార్థులందరికీ ఫీజు రీయింబర్స్ మెంట్ సహా పాత బకాయిలు పూర్తిగా చెల్లింపు.
- ఆదిలాబాద్, ఖమ్మం, మెదక్ జిల్లాల్లో నూతన ఇంటిగ్రేటెడ్ యూనివర్శిటీల ఏర్పాటు, గ్రామీణ విద్యార్థులకు మెరుగైన విద్య అందించేలా 4 నూతన ట్రిపుల్ ఐటీల ఏర్పాటు.
- అమెరికాలో ఐఎంజీ అకాడమి తరహాలోనే ప్రపంచ స్థాయి క్రీడా విశ్వ విద్యాలయం ఏర్పాటు
- పోలీస్, ఆర్టీసీ ఉద్యోగుల పిల్లల కోసం వరంగల్, హైదరాబాద్ ల్లో 2 విద్యాలయాల ఏర్పాటు, 6 నుంచి పట్టభద్రులయ్యే వరకూ నాణ్యమైన విద్య అందించడం
- 18 ఏళ్లు పైబడి చదువుకునే ప్రతీ విద్యార్థిని ఎలక్ట్రిక్ స్కూటీ అందజేత
- ఎస్సీ రిజర్వేషన్లు 18 శాతానికి పెంపు, రిజర్వేషన్లలో ఏ, బీ, సీ, డీ వర్గీకరణ అమలుకై గట్టి చర్యలు
- అంబేద్కర్ అభయ హస్తం పథకం కింద ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు రూ.12 లక్షల ఆర్థిక సాయం
- ఇళ్లు లేని ప్రతి ఎస్సీ, ఎస్టీ కుటుంబానికి ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణం కోసం రూ.6 లక్షలు అందజేత
- ఎస్సీ, ఎస్టీల అసైన్డ్ భూములు తిరిగి అసైనీలకే అన్ని హక్కులతో అప్పగింత, అర్హులందరికీ పోడు భూముల పట్టాల పంపిణీ
- సమ్మక్క సారక్క గిరిజన గ్రామీణాభివృద్ధి పథకం కింద ప్రతి గూడెం, తండా, గ్రామ పంచాయతీలకు ఏటా రూ.25 లక్షలు
- ఎస్సీ కార్పొరేషన్లకు రూ.750 కోట్ల నిధులు మంజూరు, 3 ఎస్టీ కార్పొరేషన్లు ఏర్పాటు
- నల్గొండ, మహబూబాబాద్, ఖమ్మం, మహబూబ్ నగర్, నిజామాబాద్ ల్లో 5 కొత్త ఐటీడీఏల ఏర్పాటు. అన్ని కేంద్రాల్లో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల స్థాపన
- ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు టెన్త్ పాసైతే రూ.10 వేలు, ఇంటర్ పాసైతే రూ.15 వేలు, గ్రాడ్యుయేషన్ పూర్తి చేస్తే రూ.25 వేలు, పీజీ పూర్తి చేస్తే రూ.లక్ష అందజేత. ఎంఫిల్, పీహెచ్డీ పూర్తి చేస్తే యువతకు రూ.5 లక్షలు అందజేత.
- ప్రతి మండలంలో ఎస్సీ, ఎస్టీ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు, విదేశాల్లో యూనివర్శిటీల్లో ప్రవేశం పొందిన ప్రతీ ఎస్సీ, ఎస్టీ విద్యార్థికి ఆర్థిక సహాయ అందజేత
- ప్రభుత్వం ఏర్పడిన 6 నెలల్లోపు కుల గణన, మైనార్టీలు టెన్త్ పాసైతే రూ.10 వేలు, ఇంటర్ పాసైతే రూ.15 వేలు, డిగ్రీ పాసైతే రూ.25 వేలు, పీజీ పాసైతే రూ.లక్ష. ఉర్దూ మీడియం పోస్టుల భర్తీకి ప్రత్యేక డీఎస్సీ
- దివ్యాంగుల నెలవారీ పెన్షన్ రూ.6 వేలు, అంగన్వాడీ టీచర్లకు నెల వేతనం రూ.18 వేలు, మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10 వేల వేతనం, 50 ఏళ్లు నిండిన జానపద కళాకారులకు నెలకు రూ.3 వేల పెన్షన్
- రేషన్ డీలర్స్ కు రూ.5 వేల గౌరవ వేతనం, మరణించిన జర్నలిస్టు కుటుంబానికి రూ.5 లక్షల నగదు.
- మత బోధకులకు రూ.10 వేల - రూ.12 వేల గౌరవ వేతనం, వధువులకు రూ.1.6 లక్షల సాయం
- రైతులకు 24 గంటల ఉచిత కరెంట్, కాళేశ్వరం ముంపు రైతులకు ఆర్థిక సాయం, రూ.3 లక్షల వరకూ వడ్డీ లేని పంట రుణం, ప్రతి మండలానికి ఓ మార్కెట్ యార్డ్
- పాల ఉత్పత్తి దారులకు రూ.5 ప్రోత్సాహకం, ఇబ్బందికర ఫార్మాసిటీల రద్దు, 40 వేల చెరువుల నిర్వహణ, మరమ్మతుల బాధ్యత నీటి సంఘాలకు అప్పగింత, ప్రతి జిల్లాలోనూ కోతుల సంతాన నియంత్రణ కేంద్రాల ఏర్పాటు.

### ఓపీఎస్ అమలు

కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేసింది. సీపీఎస్ (అఖా) విధానం రద్దు చేసి ఓల్డ్ పెన్షన్ స్కీం అమలు చేయడం సహా జీవో 317 ను సమీక్షించి ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి. ఏటా ఉద్యోగ, ఉపాధ్యాయుల ట్రాన్స్ ఫర్స్, కొత్త పీఆర్సీ ప్రకటించి 6 నెలల్లోపు అమలు వంటి హామీలను మేనిఫెస్టోలో చేర్చింది. ఫీల్డ్ అసిస్టెంట్లకు, ఆశా వర్కర్లకు వేతనం పెంచడం సహా ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చింది. ఉద్యోగులకు అన్ని ఆస్పత్రుల్లో వైద్యం అందేలా హెల్త్ కార్డులు అందిస్తామని ప్రకటించింది.

### నిరుద్యోగ యువత కోసం

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే తొలి క్యాబినెట్ సమావేశంలోనే మెగా డీఎస్సీ ప్రకటించి, అన్నీ ఉపాధ్యాయ పోస్టులు 6 నెలల్లోపు భర్తీ చేస్తామని మేనిఫెస్టోలో పొందుపరిచింది. రాష్ట్రంలో దాదాపు 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తామని చెప్పింది. ఒక్కసారి రుసుము చెల్లించి పబ్లిక్ సర్వీస్ కమిషన్ లో పేరు నమోదు చేసుకుంటే అభ్యర్థులు ఆ ఏడాది మిగిలిన నోటిఫికేషన్లకు రుసుం చెల్లించాల్సిన అవసరం లేదు. అన్ని ప్రభుత్వ కాంట్రాక్టుల్లో నిరుద్యోగ యువతకు అవకాశం. పోటీ పరీక్షల కోసం తెలంగాణ స్టడీ సర్కిల్స్ ఏర్పాటు. రూ.1000 కోట్ల నిధితో రూరల్ యూత్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి యువతకు ఉపాధిని ప్రోత్సహిస్తామని తెలిపింది.

### వైద్య రంగం

- అత్యవసర వైద్య సేవలకు 108, 104 అంబులెన్సుల ఆధునీకరించి విస్తరణ, ప్రతీ జిల్లా కేంద్రంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల ఏర్పాటు. ఆరోగ్య శ్రీ పథకం కింద అన్ని రకాల వ్యాధులకు రూ.10 లక్షల వర్తింపు
- ఆర్ఎంపీ, పీఎంపీలకు 6 నెలల శిక్షణ ఇచ్చి 2009 యాక్ట్ అమలు. అన్ని ప్రభుత్వాసుపత్రులను ఆధునీకరించి నాణ్యమైన ఉచిత వైద్యం అందజేత

### ఇతర హామీలు

- కల్యాణమస్తు పథకం కింద ఆడబిడ్డ వివాహానికి రూ.లక్ష, ఇందిరమ్మ కానుకగా తులం బంగారం
- మహిళలందరికీ ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, స్వయం సహాయక బృందాలకు పావలా వడ్డీకే రుణాలు
- పుట్టిన ప్రతి ఆడ శిశువుకు ఆర్థిక సాయంతో కూడిన 'బంగారు తల్లి' పథకం పునరుద్ధరణ
- మహిళా పారిశ్రామిక వేత్తలకు శిక్షణ, రేషన్ కార్డులపై సన్నబియ్యం, ఉపాధి పని దినాలు 150కు పెంపు, కనీసం వేతనం రూ.350 అమలు.
- ప్రతి ఆటో డ్రైవర్ కు ఆర్థిక సాయంగా ఏడాదికి రూ.12 వేలు, ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు, ప్రతి పట్టణంలో ఆటో నగర్ ఏర్పాటు
- పెండింగ్ లో ఉన్న ట్రాఫిక్ చలాన్లపై 50 శాతం రాయితీ,
- ఆర్టీసీ కార్మికుల ప్రభుత్వ విలీన ప్రక్రియ పూర్తి, వారికి 2 పీఆర్సీల బకాయిల చెల్లింపు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వసతులు కల్పన.



యదార్థవాది, రంగారెడ్డి, 17 నవంబరు : మహేశ్వరం నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి సబితకు షాక్ తగిలింది. మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లోని 43వ డివిజన్ కార్పొరేటర్ గజ్జల రామచందర్ బీఆర్ఎస్ పార్టీని వీడి మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. గజ్జల రామచందర్ మాట్లాడుతూ ఒక దళిత కార్పొరేటర్ నైన నాకు అధికార పార్టీలో ఆత్మగౌరవం కొరవడిందని ఆరోపించారు. నాపై రాజకీయ అణిచివేత జరుగుతుందని గౌరవానికి ప్రతికైన కాంగ్రెస్ పార్టీలో చేరాలని, ఆసక్తిగా వచ్చి పార్టీలో చేరాను. మహేశ్వరం నియోజకవర్గంలో కంచుకోట అయిన కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని గెలుపులో నా వంతు కృషి ఉండాలని, ఆరు గ్యారెంటీ పథకాలు అణగారిన వర్గాలకు చేరుతాయని, కాంగ్రెస్ పార్టీలోనే పేదలకు న్యాయం జరుగుతుందని తెలిపారు.

## చెట్టును ఢీకొన్న కారు.. ఇద్దరు మృతి

యదార్థవాది, జయశంకర్ భూపాలపల్లి, 17 నవంబరు : భూపాలపల్లి జిల్లాలో గురువారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోట చేసుకుంది. వేగంగా వచ్చిన కారు అదుపు తప్పి రోడ్డుపక్కన చెట్టును బలంగా ఢీ కొట్టింది. ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు.మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. సుల్తాన్ పూర్ గ్రామానికి చెందిన పూజారి పవన్ (23), సుబ్బక్కపల్లి గ్రామానికి చెందిన చింతల సాయికిరణ్ లు మొగుళ్లపల్లి మండలంలో జరిగిన ఓ వివాహానికి హాజరై తిరిగి వస్తున్నారు. భూపాలపల్లి జిల్లా రేగొండ శివారుకు దగ్గరకు రాగానే కారు అదుపు తప్పి చెట్టును ఢీ కొట్టింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## గ్యారంటీలకు గాంధీలు, క్షమాపణలకు బంట్రోతులా

యదార్థవాది, హైదరాబాద్, 17 నవంబరు : ఆరు దశాబ్దాల పాటు తెలంగాణను మోసం చేసిన గాంధీలు కనీసం స్వయంగా క్షమాపణ చెప్పలేరా అని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. గ్యారంటీలకు గాంధీలు, క్షమాపణలకు బంట్రోతులా అని నిలదీసారు. పదేండ్లలో ఒక్కసారి కూడా మీ కుటుంబానికి వందలాది తల్లుల కడుపు కోత గుర్తు రాకపోవడం బాధాకరం! ఈ గడ్డమీద జోడోయాత్రలు చేసి ఒక్కసారి కూడా జైతెలంగాణ చెప్పకపోవడం దారుణం. ఈ రోజుకీ మీకు అమరవీరుల స్థూపానికి దారి తెలియకపోవడం అత్యంత బాధాకరం. సోనియా, రాహుల్ గాంధీలు అమరవీరుల స్థూపం ముందు మేకరిల్లినా మీ పాపాలకు ప్రాయుశ్చిత్తం ఉండదని ఆమె వ్యాఖ్యానించారు.

## గంగుల?, నీలెక్క గుట్టలు మాయం చేశానా ?

(మొదటి పేజీ తరువాయి భాగం)



గంగులను కరీంనగర్ కే పరిమితం చేసిందు. బి.ఫాం ఇవ్వకుండా సతాయించిందు" అంటూ కౌంటర్ ఇచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కరీంనగర్ లోని చామన్ పల్లి గ్రామానికి విచ్చేసిన బండి సంజయ్ కుమార్ కు స్థానికులు ఘన స్వాగతం పలికారు. తిలకం దిద్ది కొందరు, పూలు చల్లి కొందరు, శాలువా కప్పి ఇంకొందరు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ఆయన సమక్షంలో బీజేపీలో చేరారు. నన్ను ఎంపీగా గెలిపిస్తే?. రోజు మీకోసం కొట్లాడిన. తెలంగాణ మొత్తం తిరిగి పేదల కోసం కోట్లాడిన. జైలుకు పోయిన. కేసీఆర్ నాకు ఇచ్చిన గిఫ్ట్ ఏందో తెలుసా? 74 కేసులు నామీద పెట్టిండని ఆరోపించారు.

మోదీ ప్రభుత్వం 2 లక్షల 40 వేల ఇండ్లు మంజూరు చేయిస్తే కేసీఆర్ ప్రభుత్వం వాటిని ప్రజలను కట్టివ్వలేదు. ఆ ఇండ్లు కట్టిస్తే, తెలంగాణకు మరో 5 లక్షల ఇండ్లు మంజూరు చేయించే బాధ్యత నేను తీసుకుంటానని చెప్పినా పట్టించుకోలేదు. నేను వస్తుంటే, తీగలగుట్టపల్లి బ్రిడ్జి దగ్గర గంటసేపు ట్రాఫిక్ జాంలో ఇరుక్కున్న. 10 ఏండ్లుగా అక్కడ జనం ఇబ్బంది పడుతున్నరు. ఆర్వోబీ కట్టాలని అడుగుతున్నా ఏనాడూ గంగుల పట్టించుకోలేదు. నేనే కేంద్రంతో మాట్లాడి నిధులు తీసుకొస్తే ఆర్వోబీ పనులు మొదలైనయని అన్నారు.

నేను చామన్ పల్లికి రాలేదంట. పంట నష్టపోతే ఈ ఊరికి వచ్చి అండగా నిలిచిన. వడ్ల కొనుగోలు టైంలో ఇక్కడికి వచ్చి మీ తరుపున కొట్లాడిన. మరి గంగుల ఈ ఊరికి ఏం చేసిండు. రేషన్ మంత్రి ఆయనే కదా? ఒక్క సంతకం చేస్తే పేదోళ్లందరికీ కొత్త రేషన్ కార్డు ఇచ్చిండదా? అంతెందుకు పంట నష్టపోతే కేసీఆర్ ఈ జిల్లాకు వచ్చి పోయిండు కదా? మీ బాబు (కేసీఆర్) వాళ్లకు ఎందుకు సాయం చేయలే? నేను మీకోసం కొట్లాడితే జైలుకు ఎందుక పంపాడు. స్మార్ట్ సిటీ నిధులు నేను తీసుకొచ్చిన. కరీంనగర్.. వరంగల్ రోడ్డు, కరీంనగర్, జగిత్యాల రోడ్డు నిధులు నేను తీసుకొచ్చిన. ప్రభుత్వాసుపత్రి నిధులు నేను తీసుకొచ్చినా. కానీ వాటన్నింటికీ గంగుల కొబ్బరకాయలు కొడతడు.. నాకు డౌటొస్తుంది.. గంగుల ఏమైనా కొబ్బరికాయల దుకాణం పెట్టిండా? గంగులకు దమ్ముంటే? నేను చెప్పిన వాటిపై లెక్కలతోసహా చెప్పేందుకు సిద్ధం? ఆయనకు ఉందా అని నిలదీసారు.

గువ్వల బాలరాజు గెలుపు కు అందరం ఏకం కావాలనీ బీ ఆర్ ఎస్ జిల్లా నాయకులు కేటి తిరుపతయ్య అన్నారు. శుక్రవారం లింగాల మండల పరిధిలోని కోమటి కుంట గ్రామానికీ ప్రచారంలో భాగంగా వేలడం తో వారికి గ్రామ సర్పంచ్, బీ ఆర్ ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మహిళలు అధిక సంఖ్యలో వారికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్బగా కే టీ మాట్లడుతూ తూ కోమటి కుంట గ్రామానికీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ప్రత్యేక నిధులు మంజూరు చేసి గ్రామం లో మట్టి రోడ్ల ను,సి సి రోడ్ లు వేసిన ఘనత ఎమ్మెల్యే గువ్వల అని కొనియాడారు. అదే కాకుండా బాకారం నుంచి గ్రామానికీ బీ టీ రోడ్, కోమటి కుంట టు బొప్పల్లి కీ మెంటల్ రోడ్. గ్రామ ఆంజనేయ స్వామి గుడి నిర్మాణం కి ఆర్థిక సాయం. అందజేశారు. ఇవే కాకుండా రాష్ట్ర లో కేసిఆర్ మరెన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని అన్నారు. కె ఎల్ ఐ కాల్వల ద్వారా సాగునీరు ,రైతులకు ఏకరనికి 10 వెలు రైతు బంధు ద్వారా,5 లక్షలు రైతు బీమా ద్వారా, నుతన



గ్రామపంచాయితీ లు, భావనలు నిర్మాణం కోసం నిదులు మంజూరు చేయడం. లింగాల మండలము లో ప్రతి గ్రామానికీ అనేక పథకాలను ప్రవేశపెట్టారని వారు గుర్తు చేశారు. నవంబరు 30 న జరిగే ఎన్నికలో గువ్వల బాలరాజు కి కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీ తో గెలిపించాలని కోరారు. ఇంటి ఇంటి ప్రచారం చేపట్టారు. మహిళలు యువకులు నాయకులు డప్పు వాయిద్యాల మధ్య గ్రామంలో బీ ఆర్ ఎస్ పార్టీ ప్రచారం ముమ్మరంగా చేపట్టారు. ఈ కార్యక్రమం లోగ్రామ సర్పంచ్ బిచ్చన్న ,బీ ఆర్ ఎస్ పార్టీ అధికార ప్రతినిధి శ్రీనివాస్ ,బీ ఆర్ ఎస్ పార్టీ నాయకులు బళ్ళారి నాగేశ్వర్ కంప హరీష్, అంబి సందీప్, కే టీ రాజు,బీ ఆర్ ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సల్లంగా చూడయ్యా నాగరాజా

- మంథనిలో ఘనంగా నాగుల చవితి వేడుకలు
- పుట్టలో పాలు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించిన మహిళలు

యదార్థవాది, మంథని, 17 నవంబరు : మంథని పట్టణంలో నాగుల చవితి వేడుకలను శుక్రవారం భక్తులు ఘనంగా జరుపుకున్నారు. మంథని మున్సిపల్ పరిధిలోని బోయినిపేటలోని శ్రీ నాగులమ్మ ఆలయం తో పాటు, పెంజేరుకట్టలోని నాగుల సంధిలో శ్రీనాగమయ్య పుట్ట వద్ద భక్తులు పాలు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సల్లంగా చూడయ్యా నాగరాజా అంటూ మహిళలు నాగదేవతలను వేడుకున్నారు. తెల్లవారుజామునే పుణ్యస్నానాలు ఆచరించి నోముల దారాలు, నువ్వులు, పండ్లు, పాలతో పాటు చలిమిడి ముద్దలు తయారు చేసుకుని పుట్టల వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు చేసి నాగుల చవితిని ఘనంగా జరుపుకున్నారు.ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. మైసమ్మ, రావి, వేప చెట్లకు ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా మంథని మండలంలోని పలు గ్రామాల్లో నాగుల పంచమి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించుకున్నారు. గాజులపల్లిలోని శ్రీ సంతాన నాగేంద్రస్వామి ఆలయంతో పాటు



గ్రామాల్లోని పుట్టల వద్ద పూలు, పండ్లతో భక్తులు పూజలు నిర్వహించారు. సంతాన నాగేంద్రస్వామిగా మంథని ప్రాంతంలో పేరుగాంచి ఉండటంతో గ్రామస్తులతో పాటు ఇతర గ్రామాల నుంచి భక్తులు పెద్దఎత్తున వచ్చి, పుట్టలో పాలు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున ఆలయానికి భక్తులు తరలిరావడంతో ఆలయ ఆవరణ సందడిగా మారింది.

# దళిత బంధు కోసం లంచాలు

యదార్థవాది, ఖమ్మం, 17 నవంబరు : తెలంగాణ ప్రజలకు, సీఎం కేసీఆర్ కు మధ్య ఉన్నది కేవలం రాజకీయం సంబంధం మాత్రమేనని, రాష్ట్ర ప్రజలకు, తనకు ఉన్నది కుటుంబ బంధం అన్నారు కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ. గతంలో ఇందిరా గాంధీకి అవసరం ఉన్నప్పుడు తెలంగాణ ప్రజలు ఆమెకు మద్దతుగా నిలిచారని గుర్తుచేసుకున్నారు. తెలంగాణ ప్రజలతో తమకు తరతరాల నుంచి అనుబంధం ఉందన్నారు. నర్సంపేటలో కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో రాహుల్ గాంధీ పాల్గొన్నారు. రాష్ట్ర ఏర్పాటులో ఎన్నో సమస్యలు వచ్చినా, సోనియా గాంధీ వెనక్కి తగ్గకుండా తెలంగాణ ప్రజల కల సాకారం చేశారు. కానీ రాష్ట్రాన్ని తాము కేవలం ఒక కుటుంబ కోసం ఇవ్వలేదని సీఎం కేసీఆర్ కుటుంబాన్ని ఉద్దేశించి పరోక్షంగా వ్యాఖ్యానించారు. తెలంగాణ సంపదను ఒక్క కుటుంబం దోచుకుందని ఆరోపించారు. కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు పేరుతో సీఎం కేసీఆర్ ఫ్యామిలీ దాదాపు లక్ష కోట్లు కొల్లగొట్టిందని ఆరోపించారు. స్వయంగా తాను వెళ్లి ప్రాజెక్టును పరిశీలించానని చెప్పారు. మరోవైపు ధరణి అనే వెబ్ సైట్ తీసుకొచ్చి రాష్ట్ర ప్రజల భూముల్ని కేసీఆర్, బీఆర్ఎస్ నేతలు లాక్కున్నారంటూ మండిపడ్డారు. రైతులు ధరణి కారణంగా ఎంతో నష్టపోయారు. ఎక్కువ డబ్బులు వచ్చే మంత్రుల శాఖలన్నీ కేసీఆర్ కుటుంబసభ్యులు తమ వద్ద అట్టిపెట్టుకుని ఉన్నారని రాహుల్ గాంధీ అన్నారు.దళిత బంధు పథకం ఇచ్చేందుకు రూ.3 లక్షల లంచం తీసుకుంటున్నారని రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. ఈ 70 ఏళ్లలో కాంగ్రెస్ ఏం చేసిందన్న ప్రశ్నకు రాహుల్ తనదైనశైలిలో బదులిచ్చారు. సీఎం కేసీఆర్ చదువుకున్న స్కూల్స్ కట్టించింది కాంగ్రెస్ అని గుర్తుంచుకో వాలన్నారు. హైదరాబాద్ లో వేలాది కోట్లు ఐటీ పన్ను వసూలు చేస్తున్నారో దాన్ని రూపొందించింది తమ పార్టీ అన్నారు. కాంగ్రెస్ పార్టీ రైతులకు ఉచిత కరెంట్ ఇచ్చింది. అధికారంలోకి వస్తే తాము మరోసారి రైతులకు ఉచిత కరెంట్ ఇస్తామని హామీ ఇచ్చారు. కరెంట్ కోసం రైతులు ఒక్క రూపాయి చెల్లించాల్సిన పనిలేదన్నారు. రైతులకు ప్రతి ఎకరాకు ఏడాది రూ.15 వేల పెట్టుబడి అందిస్తాం. రైతు కూలీలకు సైతం తాము రూ.12 వేలు ఇచ్చి ఆదుకుంటామని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. మహిళలకు నెలకు రూ.2500 వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తాం. ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ రూ.500కు అందించడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మహిళకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తా మన్నారు. యువ వికాసం ద్వారా ఉన్నత విద్య కోసం రూ.5 లక్షల భరోసా. చేయూత ద్వారా రూ.4 వేల పింఛన్ ఇస్తామని చెప్పారు. కాంగ్రెస్ తొలి కేబినెట్ మీటింగ్ లో ఆరు గ్యారంటీలకు ఆమోదం తెలిపి అమలు చేస్తామని హామీ ఇచ్చారు. 6 గ్యారంటీలను అమ లు చేసే దిశగా చర్యలు తీసుకోవడమే తమ మొదటి పని అని పేర్కొన్నారు. కేసీఆర్ కేవలం తన కుటుంబం కోసం పనిచేయగా, కాంగ్రెస్ మాత్రం దళిత, బడుగు, బలహీన వర్గాల వారికి ప్రాధా న్యం కల్పిస్తాం. కొత్త రిజర్వేషన్లతో మహిళలకు సైతం సముచిత స్థానం వస్తుందన్నారు. సీఎం కేసీఆర్ ఫ్యామిలీ దోచుకున్న నగదు వెనక్కి వసూలు చేసి ప్రజల కోసం ఖర్చు చేస్తామని రాహుల్ గాంధీ భరోసా ఇచ్చారు. ప్రతి రాష్ట్రంలోనూ ఇలాంటి పనులకు కాంగ్రెస్ శ్రీకారం చుట్టింది. బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం మూడు పార్టీలు ఒకటేనని.. తెలంగాణలో బీఆర్ఎస్ కు బీజేపీ సహకరించగా, కేంద్రంలో బీజేపీకి కేసీఆర్ మద్దతు ఇస్తారని ప్రజలు గుర్తించాలన్నారు.

# విద్యాదీవెనలో కొత్త నిబంధనలు

యదార్థవాది, ఒంగోలు, 17 నవంబరు : జగనన్న విద్యా దీవెన పథకంలో సాంకేతికంగా ఎదురవుతున్నసమస్యల్ని పరిష్కరించేందుకు ప్రభుత్వం కొత్త నిబంధనల్ని అమల్లోకి తీసుకొచ్చింది. పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్పుల చెల్లింపును గతంలో నేరుగా కాలేజీలకు రీయింబర్స్ చేసేవారు. ఈ విధానంలో విద్యార్థులు కాలేజీలకు రాకపోయినా ఫీజుల చెల్లించడం, లేని విద్యార్థుల పేరుతో లబ్ధి పొందుతున్నారనే ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వం పలు నిబంధనలు విధించింది. డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, మెడికల్, ప్రొఫెషనల్ కోర్సులు చదివే విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన పథకాల్లో ఫీజుల్ని చెల్లిస్తోంది. విద్యార్థుల తల్లి ఖాతాలకు ఇన్నాళ్లు ఫీజులు జమ చేస్తున్నారు. అయితే ఈ విధానంలో సాంకేతికంగా కొన్ని సమస్యలు ఎదరవుతున్నాయి. ఫీజుల రుసుముల్ని కొన్నిసార్లు వ్యక్తిగత అవసరాలకు వాడేసుకోవడం, సకాలంలో కాలేజీలకు ఫీజులు చెల్లించకపోవడం జరుగుతున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. విద్యార్థులు వ్యక్తిగత ఖాతాల్లో జమ చేసిన డబ్బులు, తల్లుల ఖాతాల్లో పడిన ఫీజుల్ని రకరకాల కారణాలతో కాలేజీలకు చెల్లించడం లేదు. విద్యార్థుల తల్లి పేరిట వ్యక్తిగత రుణాలు, స్వయం సహాయక రుణాలు ఉంటే సదరు ఖాతాలో ఫీజుల కోసం చెల్లించిన డబ్బుల్ని బ్యాంకులు వాటికి మళ్లిస్తున్నట్లు గుర్తించారు. ఆటో డెబిట్ సదుపాయం ఉండటంతో ఫీజు రియింబర్స్‌మెంట్ మొత్తాలను కాలేజీలకు చేరకుండా పోతుండటంతో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. జగనన్న విద్యాదీవెన నాలుగో విడత ద్వారా లబ్ధిపొందేందుకు తల్లి, విద్యార్థితో కూడిన నూతన జాయింట్ బ్యాంకు ఖాతాలను ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల 24వ తేదీలోగా కొత్త ఖాతాలను తెరవాలని విద్యార్థులకు, కాలేజీ యాజమాన్యాలకు సమాచారం ఇచ్చారు.2022–23 ఆఖరి సంవత్సరం పూర్తయిన అన్ని కేటగిరిల విద్యార్థులు తప్పకుండా జాయింట్ అకౌంట్స్ తెరవాలని సూచించారు. విద్యార్థులను ప్రైమరీ అకౌంట్ హోల్డర్‌గా , తల్లిని సెకండరీ అకౌంట్ హోల్డర్‌గా ఉండాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తల్లి మరణిస్తే.. తండ్రి లేదా సంరక్షకుడు రెండో ఖాతాదారునిగా ఉండాలని వివరించారు.ఒక కుటుంబంలో ఒకరి కంటే ఎక్కువ మంది విద్యార్థులుంటే.. అందరూ కలిసి ఒకే బ్యాంకు ఖాతా తెరవొచ్చని పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో ఇంకా ఎక్కువ సంవత్సరాలు చదవాల్సిన విద్యార్థిని ప్రైమరీ అకౌంట్ హోల్డర్‌గా గుర్తించాలని సూచించారు.రాష్ట్రంలోని ఏ బ్యాంకులోనైనా జాయింట్ ఖాతాలు తెరవొచ్చని కొత్త ఖాతాలకు ఏటీఎం, నెట్ బ్యాంకింగ్ వంటి సేవలు ఉండకూడదని స్పష్టం చేశారు. ఇప్పటికే ఈ సదుపాయాలు ఉన్న ఖాతాలకు ఏటిఎం, మొబైల్ బ్యాంకింగ్ సేవల్ని నిలిపివేయాలని ఆదేశించారు. బ్యాంకు అకౌంట్లకు చెక్ బుక్‌కు మాత్రమే తీసుకునేందుకు అనుమతి ఉందని స్పష్టం చేశారు. ఈ మేరకు రాష్ట్రంలోని రాష్ట్ర స్థాయి బ్యాంకర్లకు కూడా ప్రభుత్వం సమాచారం పంపింది.ప్రభుత్వ పథకాల్లో భాగంగా అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన పథకాలకు చెల్లిస్తున్న డబ్బును ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకులు ఇతర బకాయిలకు మళ్లించుకోవడంపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందుతుండటంతో నిబంధనలు మార్పులు చేశారు. ఈనెల 28న విద్యాదీవెన నిధులు జమ చేయనున్న నేపథ్యంలో విద్యార్థుల ఫీజులు నేరుగా కాలేజీలకు చెల్లించేలా నిబంధనలు సవరించినట్టు అధికార వర్గాలు తెలిపాయి.



యదార్థవాది, హైదరాబాద్, 17 నవంబరు : ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే శుక్రవారం హైదరాబాద్ చేరుకున్నారు. బేగం పేట విమానాశ్రయానికి ప్రత్యేక విమానంలో వచ్చిన ఖర్గేకు ఏఐసీసీ అధ్యక్షులు ఖర్గే కు ఏఐసీసీ ఇంచార్జ్ మానిక్ రావ్ ఠాక్రే, టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి తదితరులు స్వాగతం పలికారు.

## ఎస్సై నోటిఫికేషన్‌పై ఏపీ హైకోర్టు స్టే

యదార్థవాది, అమరావతి, 17 నవంబరు: ఏపీలో ఎస్సై నోటిఫికేషన్ పై ఏపీ హైకోర్టు స్టే విధించింది. రిక్రూమెంట్ లో తమకు అన్యాయం జరిగిందని హైకోర్టును కొంతమంది అభ్యర్థులు ఆశ్రయించిన విషయం తెలిసిదే. ఎత్తు అంశంలో అభ్యర్థులకు అన్యాయం జరిగిందని పిటిషనర్ తరుపు న్యాయా వాది జడ శ్రావణ్ కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. గతంలో అర్హత సాధించిన అభ్యర్థులను తాజాగా చేపట్టిన ఎస్సై రిక్రూట్ మెంట్ లో అనర్హతగా పరిగణించారని కోర్టుకు తెలిపారు జడ శ్రావణ్. గతంలో ఎత్తు అంశంలో అర్హత సాధించిన వారు...ఇపుడు ఎలా అనర్హులు అవుతారని రిక్రూట్ మెంట్ బోర్డుని న్యాయమూర్తి ప్రశ్నించారు. రిక్రూట్ మెంట్ నిలుపుదల చేయాలని కోర్టును పిటిషనర్ తరుపు న్యాయవాది కోరారు. పిటిషనర్ వాదనలతో ఏకీభవించిన న్యాయస్థానం, ఎస్సై నోటిఫికేషన్‌పై స్టే విధించింది.

## ఆరు గ్యారెంటీల పేరుతో తప్పుడు ప్రచారం చేస్తున్న కాంగ్రెస్

### మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

యదార్థవాది, హైదరాబాద్, 17 నవంబరు : కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల పేరుతో తప్పుడు ప్రచారం చేస్తోందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆరోపించారు. శుక్రవారం నాడు సనత్ నగర్ లోని సుభాష్ నగర్, సాయిబాబా నగర్, జై ప్రకాష్ నగర్, కైలాష్‌నగర్‌లలో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ కర్ణాటకలో ఇచ్చిన హామీలు అమలు చేయలేక చేతులెత్తేసింది. రాష్ట్రంలో ని కాంగ్రెస్ నాయకులకే గ్యారెంటీ లేదు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ఎంతో అభివృద్ధి జరిగింది. జరిగిన అభివృద్ధి, సంక్షేమ తో ప్రజలు తిరిగి బీఆర్ఎస్ ప్రభుత్వం రావాలని కోరుకుంటున్నారు. ఖచ్చితంగా మూడోసారి తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని అన్నారు.

## కూతురుకు ఉరివేసి, దంపతుల ఆత్మహత్య

యదార్థవాది, హైదరాబాద్, 17 నవంబరు : ముషీరాబాద్ లో విషాదం నెలకొంది. నాలుగు ఏళ్ల కూతురు కి ఉరివేసి చంపి, దంపతులు ఆత్మహత్య చేసుకున్నారు. మృతులు కర్నూల్ జిల్లా కి చెందిన వారు గా సమాచారం. మృతురాలు చిత్రకళ బిర్లా సైన్స్ సెంటర్ ఉద్యోగిని. ఆఫీసులో వేధింపులే కారణమని సూసైడ్ నోట్ పేర్కొంది. తేజస్విని (4), భర్త తో పాటు ఉరివేసుకుని మరణించారు.

## జోరుగా కాంగ్రెస్ ప్రచారం

యదార్థవాది, కుత్బుల్లాపూర్, 17 నవంబరు : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లో పార్టీ నాయకుల ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ఎన్నికల ప్రచారంలో భాగం గాఈరోజు కాంగ్రెస్ అభ్యర్థి కొలను హనుమంతరెడ్డి ఎన్ఎల్బీ నగర్ హనుమాన్ టెంపుల్ దగ్గర ప్రారంభమైన ఇంటింటి ప్రచారం షాపూర్ నగర్, సంజయ్ గాంధీనగర్, వివేకానంద నగర్ మీదగా శ్రీనివాసనగర్ కాలనీ నుండి రుడా మేస్త్రి నగర్, వల్లభాయ్ పటేల్ నగర్ లలో రోడ్ షో నిర్వహించి, ఖాజా పాన్ షాప్ వద్ద కార్నర్ మీటింగ్ తో రోడ్డు షో ముగిసింది. ఈ రోడ్ షో లో హన్మంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ 6 గారంటీలను వివరించి రాబోయే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సెక్రటరీ జ్యోత్స్నా శివారెడ్డి, బొంగునూరి ప్రభాకర్ రెడ్డి, అవిజె జేమ్స్, సంజీవ్ రెడ్డి, పండరి, డోరా అరుణ్, లలిత మరియు పార్టీ సీనియర్ నాయకులూ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాదాపూర్‌లో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాం

యదార్థవాది, రంగారెడ్డి, 17 నవంబరు : ఫ్లైఓవర్లు, అండర్ పాస్ లు, లింక్ రోడ్లు వేసి మాదాపూర్ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించామని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మాదాపూర్ డివిజన్ లోని చంద్రు నాయక్ తాండ, అయ్యప్ప సొసైటీ, సాయి నగర్ ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. ఈకార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్, వార్డు మెంబర్ శ్రీనివాస్ గౌడ్, మధుసూదన్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ ల మ్యానిఫెస్టో లు పుస్తకం లోనే ఉంటాయని ఆచరణలో అమలు చేయరని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మ్యానిఫెస్టోలో చెప్పినవి అమలు చేయడంతో పాటు ప్రజలకు ఉపయోగపడేవి మ్యానిఫెస్టోలో చెప్పనివి కూడా అమలు చేశారని గుర్తు చేశారు.



యదార్థవాది, గుంటూరు, 17 నవంబరు : వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పేద, బలహీన వర్గాల అభివృద్ధి కోసం ఏం చేసామనేది ప్రజలకు అర్ధమయ్యేలా వివరిస్తూ ముందుకెళు తున్నారు సీఎం జగన్. ఎన్నికలకు మరో 5 నెలలు మాత్రమే గడువు ఉండటంతో మరింత దూకుడుగా ముందుకెళ్లేలా సీఎం జగన్ ప్లాన్ చేసుకుంటున్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలతో పాటు అధినేతగా తాను కూడా స్పీడ్ పెంచారు. గతం కంటే మరింత దూకుడుగా ముందుకెళ్తున్నారు

సంక్షేమ పథకాలకు నిధులు విడుదల చేయడం, అభివృద్ధి కార్యక్రమాల కోసం జిల్లాల పర్యటనలకు ముఖ్యమంత్రి వెళ్తున్నారు. ఇలాంటి పర్యటనల్లో ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చెప్పుకుంటూనే ప్రతిపక్షాల తప్పిదాలపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. గతంలో కూడా సీఎం జగన్ తన బహిరంగ సభల్లో తెలుగుదేశం, జనసేన పార్టీలపై విమర్శలు చేసేవారు. కానీ టీడీపీ-జనసేన పొత్తు అధికారికంగా ప్రకటించిన తర్వాత తన విమర్శలకు మరింత పదును పెంచారు. జిల్లాల్లో స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైసీపీ ప్రభుత్వం అక్కడ చేసిన అభివృద్ధి, నగదు బదిలీ ద్వారా ప్రజలకు నేరుగా అందించిన సంక్షేమం, మేనిఫెస్టోలో 99 శాతం హామీలు నెరవేర్చడం, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు పదవుల్లో కేటాయింపులు.. ఇలా అన్ని అంశాలను వివరిస్తున్నారు. ఇదే సమయంలో ప్రతిపక్ష నేతలు

చెప్పుకొస్తున్నారు జగన్. మరోవైపు టీడీపీ-జనసేన మేనిఫెస్టోపైనా విమర్శలు మొదలు పెట్టారు ముఖ్యమంత్రి జగన్. గతంలో మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసం చేశారని, ఇప్పుడు ఎలా నమ్ముతారని ఎద్దేవా చేశారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు జరిగిన పరిస్థితికి, వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎలాంటి పరిస్థితులు ఉన్నాయో ప్రజలకు తన సభల ద్వారా వివరిస్తున్నారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్. ప్రజలతోనే నా పొత్తు?. నేను ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోను అంటూ సీఎం జగన్ ధైర్యంగా చెబుతున్న మాటలు పార్టీ కేడర్ కి మరింత భరోసా ఇస్తున్నాయని చెబుతున్నారు. టీడీపీ-జనసేన పొత్తు ప్రకటన తర్వాత వైసీపీలోని కొంతమంది నేతలు స్థానిక పరిస్థితులు అంచనా వేసుకుంటూ ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి వారికి సీఎం చేస్తున్న కామెంట్స్ మరింత భరోసా

పెంచేలా ముందుకెళ్తారని పార్టీవర్గాలు చెబుతున్నాయి. వై నాట్ 175 అంటూ తనతో పాటు పార్టీ నేతలను ప్రజాల్లోనే ఉండేలా చూస్తూ ఎన్నికలకు ముందుకెళ్తున్నారు. ఇప్పటికే వివిధ రకాల కార్యక్రమాల ద్వారా పార్టీ కేడర్‌ను ఏడాదిన్నరగా ప్రజల మధ్యలో ఉండేలా చేశారు. గడప గడపకూ మన ప్రభుత్వం, జగనన్న సురక్ష, జగనన్న ఆరోగ్య సురక్ష, సామాజిక సాధికార యాత్రలు, వై ఏపీ నీడ్స్ జగన్.. ఇలా అనేక కార్యక్రమాలతో ముందుకెళ్తున్నారు .తన ప్రభుత్వం వల్ల మంచి జరిగిందని అనిపిస్తేనే మళ్లీ ఓటు వేయండని అడుగుతున్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేసిన మంచిని వివరించడంతో పాటు సంక్షేమ పథకాలు సరిగా అందుతున్నాయో లేదో తెలుసుకుంటూ సాగిపోతున్నారు. ఇలా ఎన్నికల వరకూ పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్.



యదార్థవాది, కమాన్ పూర్, 17 నవంబరు: తనకు అవకాశం ఇస్తే మంథనియోగ వర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తానని బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థి చల్ల నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం కమాన్ పూర్ మండలంలోని రొంపిగుంట నాగారం తదితర గ్రామాల్లో కార్యకర్తలతో కలిసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ బి ఆర్ ఎస్ అధికారంలో ఉండగా మంథని నియోజకవర్గం వెనుకబడిపోయిందని తనకు అవకాశం ఇస్తే మంథని నియోజక వర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తానని అన్నారు. ప్రజలు ఏనుగు గుర్తుకు ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు.

# యాదాద్రి ప్లాన్ కు అడగడుగునా అడ్డంకులు



యదార్థవాది, నల్గొండ, 17 నవంబరు : రాష్ట్రంలో యాదాద్రి విద్యుదుత్పత్తి కేంద్రం (వైటీపీపీ) ప్రారంభంలో జాప్యం నెలకొంది. వచ్చే డిసెంబర్ లోగా విద్యుదుత్పత్తి ప్రారంభించాలని రాష్ట్ర జెన్ కో సన్నాహాలు చేసుకోగా కేంద్రం నిబంధనతో ఆ సమయంలోగా విద్యుత్ ఉత్పత్తి సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. పర్యావరణ అనుమతి (ఎన్విరాన్ మెంటల్ క్లియరెన్స్ - ఈసీ) మంజూరు కోసం 2024, జనవరి 31లోగా నివేదిక పంపాలని కేంద్ర పర్యావరణ శాఖ తాజాగా టీఓఆర్ (టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్) జారీ చేసింది. దీంతో డిసెంబర్ లోపు విద్యుదుత్పత్తి సాధ్యం కాదని స్పష్టమవుతోంది. ఎందుకంటే జనవరి 31లోగా నివేదిక పంపితే ఫిబ్రవరి లేదా మార్చిలో కేంద్ర పర్యావరణ శాఖ ఈసీని జారీ చేసే అవకాశముంటుంది. ఈసీ వచ్చిన తర్వాతే ఈ కేంద్రంలో విద్యుదుత్పత్తి ప్రారంభం సాధ్యమవుతుందని అధికార వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. యాదాద్రి ప్లాంట్ పనులు దాదాపు పూర్తైనందున డిసెంబర్ లో మొదటి, లేదా రెండో ప్లాంటులో విద్యుదుత్పత్తి ప్రారంభించాలని జెన్ కో అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే, ఈ విద్యుదుత్పత్తి కేంద్రం అమ్రాబాద్ అభయారణ్యానికి దగ్గరగా ఉందని, దీని వల్ల వన్యప్రాణులకు ముప్పు ఏర్పడుతుందని ఓ స్వచ్ఛంద సంస్థ జాతీయ హరిత ట్రైబ్యునల్(ఎన్జీటీ)లో కేసు వేసింది. దీంతో, 2023 జూన్‌లోగా మళ్లీ టీఓఆర్‌ను జారీ చేయాలని 2022 అక్టోబరులో ఎన్జీటీ ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలోనే జాప్యం నెలకొంటోంది. పర్యావరణ శాఖ టీఓఆర్ జారీ చేసిన తర్వాత దానిపై అటవీ శాఖ అధికారులు అధ్యయనం చేయాల్సి ఉంటుంది. ఆ అధ్యయన నివేదిక ఇచ్చిన అనంతరం దాన్ని పరిశీలించి కేంద్ర పర్యావరణ శాఖ ఈసీ జారీ చేస్తుంది. ఎన్జీటీ నిర్దేశించిన ప్రకారం పర్యావరణ శాఖ 2023 జూన్‌లోగా అసలు టీఓఆర్‌నే జెన్‌కోకు ఇవ్వలేదు. దీనిపై అదనంగా మరో 3 నెలలు ఎదురుచూసినా స్పందన లేకపోవడంతో గత అక్టోబరులో జెన్‌కో ఎన్జీటీని ఆశ్రయించింది. 4 వేల మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యంతో 5 యూనిట్లకు జూన్ 26, 2017న కేంద్ర పర్యావరణ శాఖ అనుమతిచ్చింది. ఈ క్రమంలో అదే ఏడాది అక్టోబర్ 17న రూ.29 వేల కోట్ల అంచనా వ్యయంతో రాష్ట్ర జెన్ కో ప్లాంట్ నిర్మాణం ప్రారంభించి, :ఊఇఒకు నిర్మాణ బాధ్యతలు అప్పగించింది. సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో నిర్మిస్తోన్న ఈ ప్లాంట్ దేశంలోనే అతి పెద్ద థర్మల్ పవర్ ప్లాంటుగా మారనుంది. అక్టోబర్ నాటికి 2 యూనిట్ల పనులు పూర్తి కాగా విద్యుత్తు ఉత్పత్తి ప్రారంభించేలా అధికారులు చర్యలు చేపట్టారు.

# ఒక్క ఛాన్స్ అంటున్న కాంగ్రెస్ కు బుద్ధి చెప్పాలి

(మొదటి పేజీ తరువాయి భాగం)

,ఎన్నికలు ముగియగానే బోడ మల్లప్ప అన్నట్టుగా ఉన్నది రాహుల్ గాంధి తీరు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఆరునెలలు పూర్తవుతుంది. కర్ణాటక ఎన్నికలపుడు గ్యారంటీల ప్రారంభానికి కాలపరిమితి పెట్టిన రాహుల్ గాంధీ ఇపుడు రకరకాల షరతులను పెడుతూ ప్రజా తీర్పును అపహాస్యం చేస్తున్నారని అన్నారు. విద్యార్థుల స్కాలర్ షిప్ లు ఇవ్వటం లేదు. కొత్త ఉద్యోగాలు ఇవ్వడం లేదు. స్కాలర్ షిప్ లు ఇవ్వకుండా కోత పెట్టి కార్మికుల పిల్లల చదువుకు దూరం చేస్తోంది. తెలంగాణ లో కాంగ్రెస్ రంగు రంగుల ప్రపంచం చూపుతోంది. కర్ణాటక ప్రజా ప్రతినిదుల్లో అసహనం వ్యక్తం అవుతోంది. అభివృద్ధి నిధులు ఇవ్వకపోతే జనాల్లోకి ఎలా వెళ్ళాలని అక్కడి ఎమ్మెల్యేలుఅడుగుతున్నారు. వెలుగుల దీపావళి కావాలా? కర్ణాటక లాంటి చీకటి కావాలా అని తెలంగాణ ప్రజలు తేల్చు కోవాలని అయన అన్నారు. ఆరు నెలల్లో అక్కడ 357 మంది కర్ణాటక రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. కానీ తెలంగాణ లో రైతు ఆత్మహత్యకు తగ్గాయి.తెలంగాణలో మేము రైతులం అని గర్వంగా చెప్పుకుంటున్నారు. గెలిచే దాకా ఒక్క ఛాన్స్ ప్లీజ్ అంటారు., ఆ తర్వాత ఎక్స్ క్యూజ్ మీ ప్లీజన్ అంటారు.ఒక్క ఛాన్స్ అంటున్న కాంగ్రెస్ కు బుద్ధి చెప్పాలి. కర్ణాటక పరిస్తితి తెలంగాణ కు కావాలా ? రాహుల్ గాంధీ.. రాంగ్ గాంధీ అయ్యారు. కర్ణాటక ఫెయిల్ మోడల్ చెప్పి ఇక్కడ ఓట్లు అడగాలని రాహుల్ గాంధీకి సవాల్ చేస్తున్నా. కర్ణాటక ఫెయిల్యూర్ మోడల్ రాహుల్ గాంధీ తీసుకొస్తున్నారు. కర్ణాటక ప్రజల్లగా తెలంగాణ ప్రజలు మోసపోరని అన్నారు. చిదంబరం మరోసారి తెలంగాణ ప్రజల మనుసు గాయం చేసేలా మాట్లాడారు. అమరవీరుల త్యాగాలను కించ పర్చేలా చిదంబరం వాఖ్యలు ఉన్నాయి. బేషరతుగా చిదంబరం తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలి. చిదంబరం తీరు ఎలా ఉంది అంటే, హిరోషిమా, నాగసాకి మీద అణుబాంబులు వేసిన అమెరికా సారి చెప్పినట్టు ఉంది.

# నేనే సీఎం....



## కాంగ్రెస్‌లో పెరుగుతున్న వాయిస్‌లు

యదార్థవాది, హైదరాబాద్, 17 నవంబరు : తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ నేతలు తమ అంతర్గత రాజకీయాలకు ముద్దుగా అంతర్గత ప్రజాస్వామ్యం అని పేరు పెట్టుకుంటారు. అంటే ఎవరికి వారు గ్రూపులను మెయిన్ టెయిన్ చేయడమే కాదు చాన్స్ వస్తే తాము పీసీసీ చీఫ్ అని లేదా ముఖ్యమంత్రి అని ప్రకటనలు చేసేసుకుంటూ ఉంటారు. వీరి తీరు చూసి ఇతర పార్టీలు.. కాంగ్రెస్ ను గెలిపిస్తే ఆరు నెలలకో సీఎం వస్తారని అలాంటి పార్టీ మనకు అవసరమా అని విమర్శలు గుప్పిస్తూ ఉంటారు. ఇప్పుడు కూడా అదే జరుగుతోంది. పూర్తి స్థాయిలో ఎన్నికలపై దృష్టి సారించాల్సిన నేతలు.. తామే ముఖ్యమంత్రి అవుతామన్న ప్రకటనలు చేసుకుంటూ ప్రత్యర్థులకు చాన్సిస్తారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే ఇదే పరిస్థితా అని ఓటర్లకూ అనుమానం కలిగేలా చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, సోనియాగాంధీ తనకు ముఖ్యమంత్రి పదవి ఇవ్వబోతున్నారని, పార్టీలో తనకంటే సీనియర్లు ఎవరూ లేరని భువనగిరి ఎంపీ, నల్గొండ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. తెలంగాణ కాంగ్రెస్ లో తన కంటే సీనియర్లు ఎవరూ లేరని ఆయన చెప్పుకున్నారు. కోమటిరెడ్డి వ్యాఖ్యలు కాంగ్రెస్ నేతల్లోనే కాదు.. ఇతర రాజకీయ పార్టీల్లోనూ చర్చనీయాశం అయ్యాయి. తెలంగాణ కాంగ్రెస్ నేతల్లో ఎవరికి వారు తానే సీఎం అని ప్రకటించుకుటూ ఉంటారు. రేవంత్‌రెడ్డి కాబోయే సీఎం అని ఆయన చెప్పుకోరు కానీ ఆయన అనుచరులు ప్రకటిస్తూనే ఉంటారు. ఇక జానా రెడ్డి ముఖ్యమంత్రి పదవి తనను వెదుక్కుంటూ వస్తుందని చెప్పారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జగ్గారెడ్డి, భట్టి విక్రమార్క, మధుయాష్కీ లాంటి నేతలు ఇప్పటికే తాము సీఎం రేసులో ఉన్నామన్నారు. కాంగ్రెస్ పార్టీలో సీఎం అభ్యర్థుల జాబితా పెద్దగానే ఉన్నది. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆరెస్ నాయకులు తరచూ ప్రస్తావిస్తూ కాంగ్రెస్‌లో డజన్ మందికిపైగానే సీఎంలు ఉన్నారని ఎద్దేవా చేస్తుంటారు. కొంత మంది సీనియర్ నేతలు ముందు కాంగ్రెస్ గెలిస్తేనే కదా ఏ పదవి అయినా వచ్చేది.. ముందు గెలుపు మీద దృష్టి పెట్టాలని సీఎం పదవిపై కామెంట్ చేస్తున్న వారికి హితవు చెబుతున్నారు. 'కాంగ్రెస్ పార్టీలో ఎవరికి వారే నేనే సీఎం అంటున్నారు. కాంగ్రెస్ నేతలు నేనే సీఎం అనడం మానేయాలి. సీఎంను అధిష్టానం నిర్ణయిస్తుంది. నాకు కూడా గతంలో సీఎం అవకాశం వచ్చిపోయింది. ముందు ఎన్నికల్లో గెలవండి. తర్వాత సీఎం పంచాయితీ' అని కామారెడ్డిలో జరిగిన బీసీ డిక్లరేషన్ సభలో సీనియర్ నేత హన్మంత రావు సీఎం రేసులో ఉన్న సీనియర్ నేతలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇలాంటి ప్రకటనలపై కాంగ్రెస్‌ను విమర్శిస్తున్న బీఆర్ఎస్‌కు రేవంత్‌రెడ్డి గట్టిగానే సమాధానం చెప్పారు. తమ పార్టీలో ఎవరైనా సీఎం కావొచ్చని అదే బీఆర్ఎస్ పార్టీలో సీఎం అవుతానని హరీష్ రావు చెప్పగలరా అని ప్రశ్నిస్తున్నారు. అలా చెబితే తెల్లవారే సరికి ఆయన జైల్లో ఉంటారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌లో ఎవరు సీఎం కావాలన్నది సీఎల్పీ భేటీలో మెజారిటీ ఎమ్మెల్యేల అభిప్రాయం మేరకు పార్టీ అధిష్టానం నిర్ణయిస్తుంది. పార్టీ ప్రయోజనాలను కాంగ్రెస్ హైకమాండ్ చూసుకుంటుంది. తెలంగాణ ఎన్నికలు హోరాహోరీగా సాగుతున్నాయి. అందులో సందేహం లేదు. హంగ్ వచ్చినా ఆశ్చర్యం లేదని విశ్లేషణలు వస్తున్నాయి. ఒక ఏ పార్టీకి అయినా పూర్తి మెజార్టీ వస్తే అది రెండు, మూడు సీట్ల వరకే ఉంటుందన్న ప్రచారం ఉంది. ఇలాంటి పరిస్థితి కాంగ్రెస్ లో వస్తే జరిగే రాజకీయం వేరు. కోమటిరెడ్డి వెంకటరెడ్డి నల్లగొండ జిల్లాలో తన అనుచరులకే ఎక్కువ సీట్లు ఇప్పించుకున్నారు. సూర్యాపేట, తుంగతుర్తి వంటి స్థానాల్లో తాము చెప్పిన వారికే ఇప్పించుకున్నారు. ఇక మనుగోడులో ఆయన సోదరుడే పోటీ చేస్తున్నారు. ఆయనతో కలిపి నలుగురు అవుతారు. ఇలా కోమటిరెడ్డి గ్రూప్ ఓ ఐదుగురు ఎమ్మెల్యేల్ని సిద్ధం చేసుకుంటే... అదే కాంగ్రెస్ కు రెండు, మూడు ఓట్ల మెజార్టీ ఎమ్మెల్యేలు ఉంటే.. పరిస్థితి ఎలా ఉంటుందో.. ఊహించడం కష్టం.

# బరిలో 70 ప్లస్ ఐదుగురు

యదార్థవాది, హైదరాబాద్, 17 నవంబరు : తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల పర్వంలో రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. ఏడుపదుల వయసు దాటిన సీనియర్ రాజకీయ నాయకులు సైతం ఈ సారి ఎన్నికల బరిలో నిలిచారు. ఈ సారి ఎన్నికల్లో తమ వారసులను ఎన్నికల బరిలోకి దించాలని కొందరు సీనియర్ నేతలు భావించినా ఆయా పార్టీల అధిష్టాన వర్గాలు వారికే టికెట్టును ఖరారు చేయడంతో వారు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. దశాబ్దాలుగా ఎన్నెన్నో ఉన్నత పదవులు నిర్వహించిన సీనియర్ నేతలు ఈ సారి ప్రత్యర్థులతో తలపడుతుండటం తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా, రాష్ట్ర వైద్యశాఖ మంత్రిగా పనిచేసిన వనమా వెంకటేశ్వరరావు వయసు 79 ఏళ్లు. తన రాజకీయ వారసుడైన వనమా రాఘవ మహిళను వేధించిన కేసులో జైలుకు వెళ్లడంతో ఇబ్బందులు వస్తాయని నాల్గవసారి వనమా వెంకటేశ్వరరావు ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు.ఎమ్మెల్యేగా విజయం సాధిస్తే ఈ ఐదేళ్లు పూర్తి అయితే ఆయన వయసు 84 ఏళ్లు కానుంది. సుధీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న వనమా ప్రత్యర్థుల నుంచి గట్టి పోటీని ఎదుర్కొంటున్నారు. మరో వైపు ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న తుమ్మల నాగేశ్వరరావు పోటీలో నిలిచారు. మంత్రిగా, ఎమ్మెల్యేగా సుదీర్ఘకాలం పాటు పనిచేసిన తుమ్మల రాష్ట్రమంత్రి పువ్వాడ అజయ్ తో తలపడుతున్నారు. మంత్రిగా, స్పీకరుగా పనిచేసిన పోచారం శ్రీనివాసరెడ్డి వయసు 74 ఏళ్లు.

# సంచలనం రేకెత్తిస్తున్న జనసేన

యదార్థవాది, విజయవాడ, 17 నవంబరు : ఏపీలో విద్యాసంక్షేమానికి పెద్దపీట వేసినట్లు వైసిపి సర్కార్ ఆర్భాటంగా ప్రకటించింది. నాడు నేడు, జగనన్న విద్యా కానుక కిట్లు, అమ్మ ఒడి, మధ్యాహ్న భోజన పథకం వంటి పథకాలతో విద్యా సంక్షేమానికి పాటుపడుతున్నట్లు వైసిపి నేతలు చెప్పుకుంటూ వస్తున్నారు. జనసేన అనుకున్నంత పని చేస్తోంది. వైసీపీ సర్కార్ అవినీతిని బయటపెడుతోంది. గణాంకాలు, రుజువులతో నిరూపిస్తోంది. దీంతో అధికార పార్టీ కలవరపాటుకు గురవుతోంది. గత నాలుగున్నర ఏళ్ల కాలంలో సంక్షేమ పథకాల మాటున జరిగిన అవినీతిని బయటకు తీసే పనిలో జనసేన పడింది. ఈ విషయాన్ని ముందే చెప్పి మరి వైసిపి సర్కార్ అవినీతిని జనసేన బయటపెడుతుండడం విశేషం. ఏపీలో విద్యాసంక్షేమానికి పెద్దపీట వేసినట్లు వైసిపి సర్కార్ ఆర్భాటంగా ప్రకటించింది. నాడు నేడు, జగనన్న విద్యా కానుక కిట్లు, అమ్మ ఒడి, మధ్యాహ్న భోజన పథకం వంటి పథకాలతో విద్యాసంక్షేమానికి పాటుపడుతున్నట్లు వైసిపి నేతలు చెప్పుకుంటూ వస్తున్నారు. అయితే పథకాల మాటున పెద్ద ఎత్తున అవినీతి జరుగుతోందని విపక్షాలు ఎప్పటినుంచో ఆరోపణలు చేస్తున్నాయి. కానీ కానీ ప్రభుత్వం పెద్దగా ఖాతరు చేసిన దాఖలాలు లేవు. ఈ తరుణంలో వైసీపీ సర్కార్ దోపిడిని రోజుకి ఒకటి బయట పెడతామని జనసేన ప్రకటించింది. ఆ ప్రకారం బయట పెడుతుండడంతో అధికార పార్టీలో కుదుపు ప్రారంభమైంది. గత రెండు రోజులుగా స్కాముల గురించి ఆధారాలతో సహా బయటపెట్టారు.ముందుగా పాఠశాల విద్యాశాఖలో జరుగుతున్న దోపిడీని బయటపెట్టారు. పిల్లల బూట్లు, బ్యాగు, డ్రెస్ క్లాత్ మెటీరియల్ పేరుతో రూ.120 కోట్ల అవినీతికి పాల్పడినట్లు జనసేన పి ఏ సి చైర్మన్ నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. ఢిల్లీలో ఈడి కొన్ని కంపెనీలపై దాడులు చేసినప్పుడు అక్కడి కాంట్రాక్టుల గుట్టు బయటపడిందని.. త్వరలో ఈడి ఇక్కడికి వస్తుందని సంచలన విషయం బయటపెట్టారు. ఇక ఇండోసోల్ కంపెనీ గురించి చెప్పనక్కర్లేదు. సదరు కంపెనీకి జగన్ సర్కార్ వేల ఎకరాలు కేటాయిస్తున్న వైనం వెనుక ఉన్న కథను జనసేన బయట పెట్టింది. అస్మదీయ కంపెనీల కోసం పారిశ్రామిక విధానాలను సైతం మార్చేశారు. ఈ భూములను నేరుగా సేల్ డీడ్ చేస్తున్నారు. అదంతా అస్మదీయ కంపెనీల కోసం రాయించుకో వడానికి నన్ను విమర్శలు ఎప్పటి నుంచి ఉన్నాయి. దీనిపై స్పష్టమైన ఆధారాలతో జనసేన బయట పెడుతుండడం విశేషం. ప్రభుత్వం మారగానే వీటన్నింటిపై పక్కాగా కేసులు నమోదు చేస్తా మని అధికారుల నుంచి సీఎం జగన్ వరకు ఎవరిని వదిలి ప్రసక్తి లేదని జనసేన చెబుతుండడం అధికార పార్టీలో ఒక రకమైన కలవరం ప్రారంభమైంది. మరో నాలుగు నెలల్లో ఏపీలో అసలు సినిమా ప్రారంభమయ్యే సూచనలు మాత్రం కనిపిస్తున్నా యి. ప్రస్తుతం విపక్ష నేతలపై జగన్ సర్కార్ అక్రమ కేసులు నమోదు చేస్తున్న నేపథ్యంలో.. జనసేన వైసిపి అవినీతిని బయట పెడుతుండడం వైసిపి నేతల్లో ఒక రకమైన భయాందోళన నెలకొంది.

# జిల్లా స్థాయి పోటీల్లో కమాన్‌పూర్ విద్యార్థిని ప్రతిభ



యదార్థవాది, కమాన్ పూర్, 17 నవంబరు: పెద్దపల్లి జిల్లాస్థాయి ఉపన్యాస పోటీలో ద్వితీయ బహుమతి జడ్పిహెచ్ఎస్ కమాన్ పూర్ విద్యార్థిని సాధించింది. జాతీయ ప్రకృతి వైద్య దినోత్సవం పురస్కరించుకొని గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ గాంధీ విజ్ఞాన్ ప్రతిష్ట సహకారంతో తెలంగాణ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు మానవ జీవన విధానంలో ప్రకృతి పాత్ర అంశంపై జిల్లాస్థాయిలో పెద్దపల్లి విద్యా వనరుల కేంద్రంలో నీ భవనంలో నిర్వహించిన ఉపన్యాస పోటీలో జెడ్పిహెచ్ఎస్ కమాన్ పూర్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న అంజుం సుల్తానా ద్వితీయ బహుమతి గెలుచుకొని రెండు వేల రూపాయల నగదు బహుమతి పొందడం జరిగింది .ఈ విద్యార్థిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎంఈఓ పల్లెపాటి సంపత్ రావు విద్యార్థినిని మరియు సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు నఫీజ్ అఫ్జల్ పాషా నీ అభినందించడం జరిగింది ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థిని విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

# ఘనంగా కోట కుమార్ జన్మదిన వేడుక



యదార్థవాది, కమాన్ పూర్, 17 నవంబరు: గోదావరిఖని చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త కోట కుమార్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. కోట కుమార్ జన్మదినం సందర్భంగా రామగుండం యువ నాయకుడు నెలకంటి రామ్ ఆధ్వర్యంలో అమ్మ పరివార్ అనాధాశ్రమంలో పిల్లలకి అన్నదానం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మనాలి రాజ్ ఠాకూర్ పాల్గొని కేక్ కట్ చేసి పిల్లలకు మిఠాయి పంపిణీ చేశారు అనంతరం పిల్లలకు వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కేసారపు రాకేష్ కొప్పు ఆంజనేయులు నేత రోడ్డ రాము రెల్ల క్రాంతి,సంతు హరి వినయ్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# రసాభాసగా మారిన టిడిపి జనసేన జాయింట్ సమావేశం

యదార్థవాది, విజయవాడ, 17 నవంబరు: కృష్ణా జిల్లా పెడన నియోజకవర్గం టిడి పి జనసేన పార్టీలు నిర్వహించిన జాయింట్ యాక్షన్ కమిటీ రసాభాసగా మారింది.ఈ సమావేశం పట్టణంలోని పెడన ఫంక్షన్ హాల్ లో నిర్వహించారు. మాజీ శాసనసభ్యులు బూరగడ్డ వేద వ్యాసు వర్గీయులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు.ఈ సమావేశానికి వేదవ్యాస్ సమాచారం లేకపోవడమే ఆయన వర్గీయులకు ఆగ్రహం తెప్పించింది. జిల్లా టిడిపి అధ్యక్షుడు కొనకళ్ళ నారాయణరావు వద్ద వ్యాస్ వర్గీయులు నిరసన వ్యక్తం చేశారు. మాజీ ఎంపీ స్పందిస్తూ ఈ విషయాన్ని తాము పరిగణలోకి తీసుకుంటామని జరిగిన పొరపాటును సరి దిద్దేందుకు ప్రయత్నిస్తామని నారాయణరావు అన్నారు. గత నాలుగు రోజుల క్రితం జనసేన పార్టీకి సంబంధించి నియోజకవర్గ బాధ్యుడిగా పెడన మండలం ఉరివి సర్పంచి పంచకర్ల సురేష ను నియమించారు.ఈ నిర్ణయాన్ని జిల్లా జనసేన అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ తీసుకున్నారన్న ఉద్దేశంతో యడ్లపల్లి రామ సుధీర్ వర్గీయులు ఆయనపై ధ్వజమెత్తారు. సమావేశం యావత్తు తీవ్ర గందరగోళం నెలకొని కుర్చీలతో కొట్టుకునేదాకా వెళ్ళింది.

యదార్థవాది NEWS తెలుగు దినపత్రిక
బాక్సాఫీస్
శనివారం | 18 | నవంబర్ | 2023


# ఆచార్యతో ఆదికేశవ పోలిక.. ఆయన ఏమన్నాడంటే!



ఆచార్య సినిమాలో ఒక గుడిని, అలాగే ఒక జాతిని కాపాడటమే కథ. ఆ కథ విషయంలో దర్శకుడు సరైన జాగ్రత్తలు తీసుకోలేదు అనిపించింది. మెగాస్టార్ చిరంజీవి హీరోగా వచ్చిన ఆచార్య సినిమా అతి పెద్ద డిజాస్టర్ గా నిలిచింది. ఆ సినిమా బ్లాక్ బస్టర్ విజయాన్ని సొంతం చేసుకుని తీరుతుందని భావించిన ప్రతి ఒక్కరు కూడా షాక్ అయ్యారు. అపజయం ఎరుగని కొరటాల శివ ఆ సినిమా తో బొక్క బోర్లా పడ్డాడు. మెగా కాంపౌండ్ కి దర్శకుడు కొరటాల శివ కి మధ్య గ్యాప్ కూడా ఆచార్య వల్ల పెరిగిందనే విషయం తెల్సిందే. ఆచార్య సినిమాలో ఒక గుడిని, అలాగే ఒక జాతిని కాపాడటమే కథ. ఆ కథ విషయంలో దర్శకుడు సరైన జాగ్రత్తలు తీసుకోలేదు అనిపించింది. అందుకే సినిమా డిజాస్టర్ అయిందని చాలా మంది అంటున్నారు. ఇప్పుడు ఆచార్య గురించి ఎందుకు అంటే... చిరు మేనల్లుడు వైష్ణవ్ తేజ్ హీరోగా ఆదికేశవ అనే సినిమా రూపొంది విడుదలకు సిద్ధం అయిన విషయం తెల్సిందే.

ఆ సినిమా గ్లిమ్స్ ను విడుదల చేసిన సమయంలో భక్తి సినిమా అనిపించుకుంది, అంతే కాకుండా ఆచార్య కి కాస్త అటు ఇటుగా పోలిక ఉన్నట్లు అనిపిస్తోందని చాలా మంది మాట్లాడుకుంటున్నారు. దాంతో చిత్ర యూనిట్ సభ్యులు జాగ్రత్త పడుతున్నారు. ఆచార్య కి ఆదికేశవ కి ఎక్కడ సంబంధం లేదని దర్శకుడు తేల్చి చెప్పాడు. ఈ నెల 24న విడుదల కాబోతున్న ఆదికేశవ సినిమా ప్రమోషన్ లో భాగంగా దర్శకుడు శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ఆదికేశవ సినిమా కథ లో శివుడి గురించి చాలా తక్కువ చూపించాం. కానీ కొందరు మాత్రం ఆచార్య తో పోల్చుతూ ఉన్నారు. అసలు ఈ సినిమా కథ పూర్తిగా విభిన్నంగా ఉంటుంది. దేవుడి కాన్సెప్ట్ అనేది పది నిమిషాలు ఉంటుందని దర్శకుడు పేర్కొన్నాడు.

# ఒజి భామ టైమ్ మామూలుగా లేదు

వీళ్ళు తప్ప మరో అప్షన్ లేదనుకునే వాళ్లకు బెస్ట్ అప్షన్ గా మారుతున్న వారిలో ప్రియాంక అరుల్ మోహన్ టాప్ లిస్ట్ లో ఉందని చెప్పవచ్చు.



ఇప్పుడు టాలీవుడ్ ఇండస్ట్రీ లో హీరోయిన్ల కొరత కాస్త ఎక్కువగానే ఉంది. మంచి ఫామ్ లో ఉన్న స్టార్ బ్యూటీలు పాన్ ఇండియా అంటూ బాలీవుడ్ అంటూ బిగ్ స్టార్స్ తో బిజీ అయ్యారు. ఇక శ్రీలీల లాంటి బ్యూటీలు కూడా వరుస సినిమాల తో మరింత బిజీ అయ్యారు. మీనాక్షి చౌదరి కూడా బిజీ అవుతోంది. వీళ్ళు తప్ప మరో అప్షన్ లేదనుకునే వాళ్లకు బెస్ట్ అప్షన్ గా మారుతున్న వారిలో ప్రియాంక అరుల్ మోహన్ టాప్ లిస్ట్ లో ఉందని చెప్పవచ్చు. ప్రియాంక అరుల్ మోహన్ మొదటి నుంచి హెూమ్లీ టైప్ క్యారెక్టర్లు ఎక్కువగా చేస్తోంది. గ్యాం గ్ లీడర్ సినిమాలో పక్కింటి అమ్మాయిలా చాలా అందంగా కనిపించిన అమ్మడు ఆ తరువాత పెద్దగా సక్సెస్ లు ఏమి అందుకోలేదు. ఇక ఇటీవల మాత్రం ఆమె టైమ్ గట్టిగానే నడుస్తోంది. ముఖ్యంగా పవన్ కళ్యాణ్ ఒజి సినిమాలో ఎప్పుడైతే ఛాన్స్ అందుకుందో అప్పటి నుంచి ఆఫర్లు పెరుగుతున్నాయి. ఇక ప్రియాంక తొందరపడకుండా మంచి కంటెంట్ ఉన్న సినిమాలను చేసే ప్రయత్నం అయితే చేస్తోంది. నానితో అమ్మడు మరో ఛాన్స్ అందుకుంది. ఇదివరకే వీరి కలయికలో గ్యాంగ్ లీడర్ అనే సినిమా వచ్చింది. ఇక ఇప్పుడు సరిపోదా శనివారం అనే సినిమా చేస్తోంది. యువ దర్శకుడు వివేక్ ఆత్రేయా డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమాలో యాక్షన్ డోస్ గట్టిగానే ఉండబోతోంది. ఇక ఆ సినిమాతో పాటు రవితేజతో కూడా మంచి ఛాన్స్ అందుకుంది. గోపిచంద్ మలినేని దర్శకత్వంలో రవితేజతో మరో యాక్షన్ సినిమా చేస్తున్నాడు. ఇంతవరకు ఫ్లాప్ చూడాని ఆ కాంబినేషన్ అంటే సినిమాపై అంచనాలు గట్టిగానే ఉంటాయి. వీటితో పాటు ప్రియాంక మరో రెండు పెద్ద బ్యానర్ లలో ఛాన్స్ అందుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనప్పటికీ ప్రియాంక జాతకం ఇప్పుడు గట్టిగానే నడుస్తోంది. చేతిలో ఉన్న సినిమాలలో ఒక్కటి క్లిక్ అయినా కూడా అమ్మడి రేంజ్ అమాంతం పెరిగిపోవడం పక్కా. ఇక పోటీగా శ్రీలీల మీనాక్షి చౌదరి లాంటి వాళ్ళు మాత్రమే ఉన్నారు. అగ్ర హీరోలు సెకండ్ టైమ్ వాళ్ళతో చేయరు కాబట్టి రాబోయే రోజుల్లో అగ్ర హీరోల ప్రియాంక వైపు చూడవచ్చు. మరి ఆ లోపు అమ్మడు ఎలాంటి అవకాశాలు అందుకుంటుందో చూడాలి.

# ఆ ఎదురు చూపులు ఎవరి కోసమే!



శామా సికిందర్ ఇన్ న్ స్టా సెన్సేషన్ గురించి చెప్పాల్సిన పనిలేదు. ఎలాంటి డిజైనర్ లో నైనా శామా సెగలు పుట్టించాల్సిందే. శామా సికిందర్ ఇన్ న్ స్టా సెన్సేషన్ గురించి చెప్పాల్సిన పనిలేదు. ఎలాంటి డిజైనర్ లో నైనా శామా సెగలు పుట్టించాల్సిందే. ఎలివేషన్ లో తనదైన మార్క్ తప్పనిసరిగా భావిస్తుంది. హీటెక్కించే ఘాటు ఫోజుల్లో ఏమాత్రం తగ్గదు. చీర కట్టినా.. చిట్టి పొట్టి దుస్తులేసినా షామా అందాలకి కుర్రాళ్లంతా స్టన్ అవ్వాల్సిందే. ఈ మధ్య కాలంలో ఆ వేడి మరింత రెట్టింపు చేసినట్లు కనిపిస్తుంది. ఖాతా ఓపెన్ చేయగానే ఫ్రెష్ లుక్ తో పేంపర్ చేస్తుంది. తాజాగా అమ్మడు ఓ క్లోజ్ అప్ షాట్ తో మరోసారి నెట్టింట్లోకి వచ్చేసింది. ఇదిగో ఇక్కడిలా గ్రీన్ కలర్ డిజైనర్ దుస్తుల్లో ఒదిగిపోయింది. అమ్మడు ధరించిన బ్లౌజ్ సంథింగ్ స్పెషల్ గా ఫోకస్ అవుతుంది. ఎద అందాల వడ్డనతో ఓ రేంజ్ లో ట్రీట్ ఇచ్చింది. సొగసరి ఎంపిక చేసుకున్న యాక్సరీస్...చెవి బులకాలు అన్ని శామాని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దాయి. ఇక తుదిగా అమ్మడు ఎంపిక చేసుకున్న కెమెరా భంగిమ అంతకంతకు కాకా పుట్టిస్తుంది. పరువాలు దారబోసి ఎదురు చూస్తున్న భంగిమ ఆకట్టు కుంటుంది. %ూశ్రీంశీ =ఘ%ఽ - యంగ్ హీరో సినిమాలో పాన్ ఇండియా స్టార్స్ ప్రస్తుతం ఈ ఫోటో అంతర్జాలంలో వైరల్ గా మారింది. శామా అభిమానుల కామెంట్లు అంతే ఆసక్తికరం. శామా ఇన్ స్టాలో ఎంత ఫేమస్ అయినా ఏం లాభం? కెరీర్ పరంగా ఎలాంటి ఎదుగుదల లేదు. వృత్తి పరంగా ఇంకా వెనుకబడే ఉంది. ప్రేమ్ అగాన్ సినిమాతో బాలీవుడ్ లో ఎంట్రీ ఇచ్చిన బ్యూటీ అటుపై మన్-ది డెడ్లీ పార్ట్.. బస్తీ..దూమ్ ధడాకా..కాంట్రాక్ట్..సెక్సాహెూలిక్- లాంటి సినిమాల్లో నటించింది. బ్యూటీ చివరిసారిగా నటించిన బైపాస్ రోడ్ లో నటించింది. ఆ సినిమా రిలీజ్ అయి మూడేళ్లు అవుతుంది. అప్పటి నుంచి ఇప్పటివరకూ కొత్త అవకాశాలేవి అందుకోలేదు. మరి తాజా ప్రయత్నాలేవైనా ఛాన్సులు తెచ్చి పెడతాయా? అన్నది చూడాలి. సొగసరి ప్రయత్నంలో మాత్రం లోపం లేదు. శక్తి వంచన లేకుండా శ్రమిస్తుంది. కానీ అవకాశాలు మాత్రం కను చూప మేర కనిపించలేదు.

# హీరోయిన్ గా చేయడం కంటే దానిపైనే ఎక్కువ ఆసక్తి...!



సినిమా ఫలితాలతో సంబంధం లేకుండా ఈ అమ్మడు తన కెరీర్ లో దూసుకు పోతుంది. భారీ ఎత్తున ఈ అమ్మడి యొక్క పారితోషికం పెరిగింది టాలీవుడ్ లో ప్రస్తుతం మోస్ట్ బిజీ హీరోయిన్ ఎవరు అంటే అందరూ చెప్పే పేరు శ్రీలీల. ఈ అమ్మడు మొదటి సినిమా నిరాశ పరిచినా కూడా అదృష్టం బాగుండటంతో వరుసగా ఆఫర్లు దక్కించుకుంటూ ఉంది. అదృష్టం కి తోడు అందం మరియు ప్రతిభ కూడా ఈమె సొంతం. అందుకే ఇండస్ట్రీలో శ్రీలీల దున్నేస్తోంది. సినిమా ఫలితాలతో సంబంధం లేకుండా ఈ అమ్మడు తన కెరీర్ లో దూసుకు పోతుంది. భారీ ఎత్తున ఈ అమ్మడి యొక్క పారితోషికం పెరిగింది. అయినా కూడా నిర్మాతలు ఈమె అడిగినంత ఇచ్చి మరీ తమ సినిమాల్లో బుక్ చేస్తున్నారు. హీరోయిన్ గా నెం.1 స్థాయిలో ఉన్నా కూడా చిన్నప్పటి నుంచి కోరుకున్న ఎంబీబీఎస్ ని మాత్రం వదలను అంటోంది.

నా తల్లిదండ్రులు చిన్నప్పటి నుంచి కూడా నేను డాక్టర్ అవ్వాలని కోరుకున్నారు. అందుకే నేను ఎంబీబీఎస్ చేస్తున్నాను. చిన్నప్పుడే నా మనసులో డాక్టర్ అవ్వాలని పడింది. అందుకే హీరోయిన్ గా అయినా కూడా చదువును అశ్రద్ధ చేయడం లేదు అంటూ ఆమె పేర్కొంది. మొత్తానికి శ్రీలీల ఎంబీబీఎస్ పూర్తి చేసి తీరుతాను అంటోంది. చదువు సరిగా రాని వారు, ఏ పని చేత కాని వారు సినిమాల్లోకి వస్తారు అంటూ కొందరు అనుకుంటూ ఉంటారు. అలాంటి వారు అందరికి కూడా శ్రీలీల సమాధానం అనడంలో సందేహం లేదు. హీరోయిన్ గా శ్రీలీల ఇంత బిజీగా ఉన్నా కూడా చదువుకుంటూ, కాలేజ్ కి వెళ్తూ పరీక్షలు రాస్తుందట. నిజంగా ఈమె చాలా మందికి ఆదర్శం అనడంలో సందేహం లేదు. శ్రీలీల యొక్క గొప్ప పట్టుదలకు ఆమె యొక్క చదువుపై ఆసక్తికి ప్రతి ఒక్కరు కూడా ఫిదా అవుతున్నారు. గొప్ప హీరోయిన్ గా పేరు దక్కించుకున్నా కూడా డాక్టర్ గా వచ్చే సంతృప్తి రాదని శ్రీలీల తాజాగా ఒక ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది.

PRINTER, PUBLISHER, EDITOR AND OWNER, BINGI SATHAIAH YAADHARTHAVAADHI TELUGU DAILY, Printed at MEGHA Printers, H.No.11-52, Indira Nagar, Siddipet - 502 103. E-mail: yadaardhavadhieditor@gmail.com
TEL TEL / 2023/ 85376 # 11-52, INDRA NAGAR, PRASHANTH NAGAR, SIDDIPET - 502 103. PUBLISHED FROM: HO # 1-3-183/40/46/29, GANDHI NAGAR, HYDERABAD - 500 080.